ప్రజాశక్తి

మంగళవారం 24 డిసెంబర్ 2024 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

కొత్తపేర్లతో పాత చట్టాలు

- నూతన మార్కెటింగ్ విధానాన్ని ఉపసంహరించుకోవాలి
- గుంటూరు, నరసరావుపేటలో రైతు సంఘాల నిరసన
- బిల్లు ముసాయిదా ప్రతుల దహనం - రాష్ట్రపతికి వినతులు

ప్రజాశక్తి-గుంటూరు, పల్నాడు జిల్లా

పంటలను కార్పొరేట్లకు కారుచౌకగా అప్పగించటానికి కేంద్రం 'నేషనల్ పాలసీ ఫ్రేమ్ వర్క్ ఆన్ అగ్రికల్చర్ మార్కెటింగ్' పేరుతో చట్టం తేవటానికి చేస్తున్న యత్నాన్ని విరమించుకోవాలని రైతు, కార్మిక, వ్యవసాయ కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు గుంటూరు కలెక్టరేట్ ఎదుట, పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని స్టేషన్‌రోడ్డులో గాంధీ పార్క్ ఎదుట సోమవారం నిరసన చేపట్టి ముసాయిదా ప్రతులను దహనం చేశాయి. గుంటూరు నిరసనలో వివిధ రైతు సంఘాల నాయకులు కంచుమాటి అజయ్‌కుమార్, కొల్లి రంగారెడ్డి, ఉల్లిగడ్డల నాగేశ్వరరావు, పాశం రామారావు, జొన్నా శివశంకర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, కౌలురైతు సంఘం జిల్లా నాయకులు జగన్నాథం, కృష్ణ, విటల్‌రెడ్డి, కార్మిక సంఘాలు నాయకులు హనుమంతరావు, కె.శ్రీనివాసరావు తదితరులు మాట్లాడారు. గతంలో ఢిల్లీలో రైతు పోరాట ఫలితంగా మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేసిన కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఇప్పుడు దొడ్డిదారిన, కొత్తపేర్లతో ఆయా చట్టాలను తేవాలని చూస్తోందని, నూతన మార్కెటింగ్ ముసాయిదా చట్టం అందులో భాగమని విమర్శించారు. తక్షణమే ఈ ముసాయిదాను ఉపసంహరించుకోవాలని, లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. పంటలకు మద్దతు ధరలు కల్పించాలని, రైతులు ఎదుర్కొంటున్న ఇతర సమస్యల పరిష్కారానికి ఢిల్లీ సరిహద్దు శంభు బోర్డర్లో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న రైతులపై కేంద్ర ప్రభుత్వం, హర్యానా, ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రమైన అణిచివేత చర్యలు సాగిస్తున్నాయని తెలిపారు. ఆయా రైతులపై అక్రమంగా కేసులు పెట్టి, మహిళా రైతులతో ▶ 2లో

గుంటూరు, నరసరావుపేటలో ముసాయిదా బిల్లు ప్రతులు దహనం చేసి నిరసన తెలుపుతున్న సంఘాలు

మిర్చి ధరల కోత

- యార్డుకు కొత్త సరుకు - తగ్గిన ధరలు
- ఎగుమతులు లేవంటున్న వ్యాపారులు
- స్పెషల్ వెరైటీలకూ తప్పని కోతలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు మిర్చి యార్డులో ధరలు రోజుకు రోజుకు తగ్గుతున్నాయి. ఖరీఫ్‌లో సాగు చేసిన పంట క్రమంగా మార్కెట్‌కు వస్తోంది. ప్రధానంగా తెలంగాణ, కర్నాటక రాష్ట్రాలకు చెందిన కొన్ని ప్రాంతాలతో పాటు అనంతపురం, కర్నూలు జిల్లా నుంచి ఎక్కువగా సరుకు వస్తోంది. సోమవారం గుంటూరు మిర్చి యార్డుకు 65,687 టిక్కీలు రాగా 60,866 టిక్కీలు అమ్ముడుపోయాయి. పాత నిల్వలతో కలిపి 49,236 టిక్కీలు నిల్వ ఉన్నాయి. సరుకు రావడం క్రమంగా పెరుగుతున్నా ధరలు మాత్రం తగ్గుముఖం పట్టాయి. నాన్ ఎసి కామన్ వెరైటీ క్వింటాళ్ కనిష్ఠ ధర రూ.7500 మాత్రమే ఉండగా గరిష్ఠ ధర రూ.14,800 వచ్చింది. అయితే గతేదాది ఇదే రోజుల్లో క్వింటాళ్ రూ.12 వేల నుంచి రూ.16 వేల వరకు పలికింది. ▶ 2లో

వార్త మెయిన్‌లో

మాట్లాడుతున్న పెనుగొండ లక్ష్మీనారాయణ

నిత్య సాహిత్య శ్రామికుడు పెనుగొండ

గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఘన సన్మానం

ఎన్నిసార్లు వస్తే అన్నిసార్లు టోల్ ఫీజు

- రాష్ట్ర ప్రభుత్వ నూతన విధానంపై సిపిఎం నిరసన
- కాజా టోల్‌ప్లాజా వద్ద సిపిఎం నిరసన

టోల్‌ప్లాజా వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం శ్రేణులు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

రాష్ట్ర ప్రభుత్వం పెంచిన టోల్ ప్లాజా ఫీజులు రద్దు చేయాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ ఆధ్వర్యంలో మండలంలోని కాజా టోల్‌గేట్ వద్ద సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఇ.అప్పారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మార్పు చేసిన టోల్ ఫీజులు విధానం వల్ల వాహనదారుల పైనే కాకుండా ప్రజలపైనా భారాలు పడుతున్నాయన్నారు. గతంలో వాహనదారులు ఒకసారి టోల్ ఫీజు రూ.160 చెల్లిస్తే తదుపరి 24 గంటలలో ఎన్నిసార్లు తిరిగినా మళ్లీ రుసుం చెల్లించాల్సిన అవసరం ఉండేది కాదని, తాజాగా ప్రభుత్వం సవరించిన విధానంలో టోల్‌ఫీజు రూ.240కు పెరగడమే కాకుండా, వాహనం ఎన్నిసార్లు తిరిగితే అన్నిసార్లు ఫీజు చెల్లించాల్సి వస్తుందని తెలిపారు. దీనివల్ల గుంటూరు, మంగళగిరి తిరిగే సర్వీస్ ▶ 2లో

చండీఘర్ డిస్కం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా

రేపు నిరసన

▶ 5లో

నోటీసులు ఇవ్వకుండా తొలగింపులు

బాధితుల ఆవేదన

పేజీ-3

మిర్చి ధరల కోత

(మొదటి పేజీ తరువాయి)

పేరెన్నిక స్పెషల్ వెరైటీలైన తేజ, బాడిగ ధరలు కూడా భారీగా తగ్గాయి. తేజ కనిష్ట ధర రూ.8 వేలు, గరిష్ట ధర రూ.16 వేలు పలికింది. బాడిగ కనిష్ట ధర రూ.8 వేలు, గరిష్ట ధర రూ.13,500 లభించింది. దేవనూరు డీలక్స్ కనిష్టం రూ.9 వేలు, గరిష్టం రూ.15 వేలు వచ్చింది. ఈ మూడు వెరైటీల ధరలు కూడా గతేడాదితో పోల్చుకుంటే క్వింటాళ్ రూ.5 వేల కోతపడిందని చెబుతున్నారు. మొత్తంగా కొత్త సరుకు తీసుకుని వచ్చిన రైతులకు తీవ్ర నిరాశ ఎదురవుతోంది.

కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకున్న రైతులకు కూడా ఆశాజనకమైనధరలు లేవు. ఎసి కామన్ వెరైటీలు క్వింటాళ్ సగటు ధర కనిష్టం రూ. 8 వేలు, గరిష్ట ధర రూ.14,500 పలికింది. స్పెషల్ వెరైటీలు తేజకు కనిష్టం రూ.8 వేలు, గరిష్ట ధర రూ.16,500, బాడిగ ధర రూ.8400-12000 వరకు లభించాయి. దేవనూరు డీలక్స్‌కు క్వింటాళ్ కనిష్టం ధర రూ.8500, గరిష్ట ధర రూ.15,500 వచ్చింది. అయితే ఎక్కువ సరుకుకు కనిష్ట ధరలే లభించాయి. ఈ ఏడాది అన్నిరకాలు ధరలు క్వింటాళ్‌కు రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు తగ్గాయి.

ప్రస్తుతం కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యశాయి, తెలంగాణలోని గద్వాల, కర్నాటక హుబ్లీ, బళ్లారి తదితర ప్రాంతాల నుంచి రోజూ 50 నుంచి 60 వేల టిక్కీలు వరకు వస్తున్నాయి. వివిధ దేశాలకు ఎగుమతి అవకాశాలు తగ్గడం, వ్యాపారులు సిండికేట్ కావడం, కొత్త సరుకు తక్కువ ధరకు కొని నిల్వ చేసుకునేందుకు వ్యాపారులు ఆసక్తి కనబరుస్తున్నారు. ఇప్పటికే కోల్ట్ స్టోరేజీల్లో దాదాపు 20 లక్షల వరకు నిల్వ ఉన్నట్లు చెబుతున్నారు. ఈ ఏడాది పంట విస్తీర్ణం తగ్గడం వల్ల భవిష్యత్తులో ధరలు మరింత పెరుగుతాయని భావించి వ్యాపారులు ముందుగానే ధరలు తగ్గిస్తున్నారు. బంగ్లాదేశ్, చైనా,శ్రీలంక తదితర దేశాలకు జనవరి తరువాత ఎగుమతి అవకాశాలు వస్తే కానీ ధరలు పెరగవని అంటున్నారు. సుధూర ప్రాంతాల నుంచి గుంటూరు వరకు వెళ్లినా అదే ధర గ్రామాల్లో కూడా ఇదే ధర ఉంటుందని భావించేలా చేయడానికి ఇలా ధరలు తగ్గిస్తున్నారనే విమర్శలు లేకపోలేదు. తేమ శాతం అధికంగా ఉందని కూడా ధర కొంత తగ్గిస్తున్నారని రైతులు వాపోతున్నారు. ప్రస్తుత వాతావరణంలో ఎప్పుడు వాన వస్తుందో? ఎప్పుడు ఎండ వస్తుందో తెలియక కళ్లాల్లో ఆరబోసుకున్న వారు కూడా ఆందోళనలో ఉన్నారు.

ఎన్నిసార్లు వస్తే అన్నిసార్లు టోల్ ఫీజు

(మొదటి పేజీ తరువాయి)

టాటా మ్యాజిక్‌లు, స్కూల్ బస్సులపై, ఆర్‌టిసి బస్సులపై పెద్దమొత్తంలో భారం పడుతున్నదన్నారు. ఇంతకు ముందు టోల్‌గేట్‌కు 20 కిలోమీటర్లులోపు నివాసం వుండే వారి వాహనాలపై నెలకు రూ.840 ఫీజు చెల్లిస్తే సరిపోయేదని, ప్రస్తుతం ప్రభుత్వం ఆ వాహనదారులను రెండు కేటగిరీలుగా విడగొట్టి బాడుగకు తిప్పే వాహనాలకు ఈ సౌకర్యాన్ని పూర్తిగా రద్దు చేశారని అన్నారు. సొంతానికి వినియోగించే వాహనాలపై రుసుం కూడా పెంచారన్నారు. రవాణా వాహనాలపై పెంచిన టోల్ ఛార్జీల భారం వల్ల అన్ని వస్తువుల ధరలు పెరుగుతాయని, ప్రయాణికులపైనా ఛార్జీల భారం పడుతుందని చెప్పారు. ప్రజలు కొనుగోలు చేసే పెట్రోలు, డీజిల్ పైన లీటర్‌కు రూ.8ల చొప్పున రోడ్డు సెస్సు వసూలు చేస్తున్నా ఆ డబ్బులను రోడ్ల అభివృద్ధికి వినియోగించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ బడ్జెట్ అవసరాలకు వినియోగించుకుంటూ ప్రజానీకంపై టోల్‌ఛార్జీల భారం వేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండలం కార్యదర్శి యు.దుర్గారావు, నాయకులు బి.కోటేశ్వరి, ఎస్.సుమ, జి.అజయ్ కుమార్, సత్యమారెడ్డి, గోపాల్‌రెడ్డి, కోటిరెడ్డి, అరుణ, నాగేశ్వరావు, శివారెడ్డి, అప్పారావు, నిర్మల, శిరీష, రాధ, జనార్ధనరావు, సురేష్ పాల్గొన్నారు.

అరునెలలుగా అందని బిల్లులు, వేతనాలు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

- అప్పులు తెచ్చి ఆకలి తీరుస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు
- పండగ రోజుల్లోనూ అస్తుబిస్తుగా జీవితాలు

విద్యార్థుల ఆకలి తీరుస్తున్న మధ్యాహ్న భోజన నిర్వాహకులకు మాత్రం అర్ధాకలే గతవుతోంది.. అప్పులు చేసి పొట్ట నింపుతున్న వారు వడ్డీల ఒత్తిడికి గురవుతున్నారు. మండలంలో మండలంలో 88 ప్రాథమిక, 18 ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉండగా వీటిల్లోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్న 570 మంది నిర్వాహకులకు ఆరు నెల్లుగా బిల్లులు, జీతాలు అందడం లేదు. పండుగల నేపథ్యంలో ఈనెలలో అయినా మంజూరవుతాయని భావించిన వారికి ఎదురు చూపులే మిగిలాయి. మధ్యాహ్న భోజన నిర్వాహకులకు నెలకు రూ.4,500 గౌరవవేతనాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుండగా దాన్ని రూ.11,500కు పెంచుతూ జీవో 108ను జారీ చేసింది. అది అమలు కాకపోగా ఇస్తున్న గౌరవవేతనం, బిల్లులనూ ఆరు నెలలుగా పెండింగ్‌లో పెట్టారు. ఒక్కో ప్రాథమిక పాఠశాల విద్యార్థికి రూ.6.95 పైసలు, ఉన్నత పాఠశాల విద్యారిర్థికి రూ.8.25 చొప్పున ప్రతిరోజూ కేటాయిస్తూ మెనూను నిర్ణయించారు. అయితే బియ్యం, గ్యాస్, కూరగాయాలు, ఇతర సరుకుల ధరలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఇచ్చే మెనూ ఛార్జీలు ఏ మాత్రమూ చాలడం లేదు. అయినా మధ్యాహ్న భోజన కార్మికులే అప్పోసోప్పో చేసి పథకాన్ని నిర్వహిస్తున్నారు. మరోవైపు రాజకీయ కారణాలతో తొలగిస్తున్నారు. మధ్యాహ్న భోజన పథకానికి గత ప్రభుత్వం జగనన్న గోరుముద్ద అంటూ పేరు మార్చగా ప్రస్తుత ప్రభుత్వం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనంగా పేరు మార్చింది. పథకానికి పేర్లు మార్చడమేగాని దాన్ని నిర్వహిస్తున్న తమ పరిస్థితుల్లో మాత్రం మార్పు ఉండడం లేదని నిర్వాహకులు వాపోతున్నారు.

కొత్తపేర్లతో పాత చట్టాలు

(మొదటి పేజీ తరువాయి)

సహా వందలాది మంది రైతులను అరెస్ట్ చేసి జైల్లో నిర్బంధించిందని మండిపడ్డారు. ఈ పరిస్థితుల నుండి సామరస్య వాతావరణ కల్పించాలని ఆలిండియా రైతు నాయకులు జగజ్జీత్ సింగ్ దల్లేవాల్ 20 రోజుల నుండి నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్నారని తెలిపారు. మరోవైపు వైపు గ్రేటర్ నోయిడాలో భూములు కోల్పోయిన రైతులు చేస్తున్న ఉద్యమాన్ని అణచివేసేందుకు ఉత్తరప్రదేశ్ బిజెపి యోగి ప్రభుత్వం రైతులపై అక్రమంగా కేసులు పెట్టి హింసిస్తోందన్నారు. రైతులపై నీటి ఫిరంగులు, భాష్పవాయు గోళాలను ప్రయోగించడం సిగ్గుచేటన్నారు. నరసరావుపేటలో ధర్నాకు రైతుసంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఏపూరిగోపాలరావు అధ్యక్షత వహించగా రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవివి ప్రసాద్, కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ, ఎఐకెఎస్ రాష్ట్ర అధ్యక్షులు టి.అంజనేయులు, ఆల్ ఇండియా కిసాన్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు రెడ్ బాష, పిడిఎం రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు, రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉలవపూడి రాము, అధ్యక్షులు గుంటుపల్లి బాలకృష్ణ, నల్లపాటి రామారావు, వలి, సైదా, హరిబాబు, బోస్ తదితరులు మాట్లాడారు. ఆహార సబ్సిడీపై నగదు బదిలీని ప్రోత్సహించడం, ఆహార భద్రత దెబ్బ తీయటంలో భాగంగా ఎఫ్‌సిఐని నిర్వీర్యం చేయటం, ఆహార ఉత్పత్తులపై రాయితీలు తగ్గించడం, ఎరువులపై రాయితీలు ఎత్తివేయడం ద్వారా వ్యవసాయం పట్ల కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం నూతన జాతీయ మార్కెట్ విధానంతో తేటతెల్లమైందన్నారు. స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం గిట్టుబాటు ధరల చట్టం చేయాలని, కేరళ తరహాలో రుణమాఫీ చట్టం చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. 2021 డిసెంబర్ 9న రైతు సంఘాలకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాల విధానాలపై రైతులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. నిరసన అనంతరం వినతిపత్రాలను గ్రీవెన్స్ ద్వారా రాష్ట్రపతికి అందచేశారు.

కెఎల్‌పి పబ్లిక్ స్కూల్లో స్పెల్‌బి పోటీలు

ప్రజాశక్తి-గుంటూరు

పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సెక్రెటరీ తదితరులు

స్థానిక జెకెసి కాలేజిలోని డాక్టర్ కెఎల్‌పి పబ్లిక్ స్కూల్లో సోమవారం జిల్లా స్థాయి స్పెల్‌బి పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో జిల్లా వ్యాప్తంగా 28 పాఠశాలల నుండి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలను పాఠశాల సెక్రెటరీ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ జి.రత్తయ్య, ఏఒ వెంకట్రావు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ విద్యుత్ సరళ ఇంగ్లీషు పదాల నుండి కఠిన నుండి కఠిన పదాలు నేర్చుకోవాలని, ఆంగ్లము అంతర్జాతీయ భాష అని, భాషను అభివృద్ధి చేసుకోవటానికి పట్టుదలతో కృషి చేయాలన్నారు.అనంతరం జరిగిన పోటీల్లో ఫైనల్స్‌లో 6 జట్లు పోటీ పడ్డాయి. పోటీల్లో ఉషోదయ ఇంగ్లీషు మీడియం స్కూల్ చౌడవరం నుండి ఐ.హసీనా, ఎస్.ఎం.బి.రిదా షజీల్ మొదటి బహుమతి, డాక్టర్ కెఎల్‌పి స్కూల్ నుండి ఎస్.కె.ఆలియా విర్దోస్, జి.శ్రీరామ్‌లు ద్వితీయ బహుమతి, వివా ది స్కూల్ నుండి కె.యష్మిత్, వీర్ తృతీయ బహుమతి గెలుపొందారు. వీరికి నగదు బహుమతి అందచేశారు.

జిల్లా కోర్టులో ఘనంగా సెమీక్రిస్మస్

ప్రజాశక్తి-గుంటూరు లీగల్

గుంటూరు బార్ అసోసియేషన్ న్యాయవాదులు సెమీక్రిస్మస్ వేడుకలు సోమవారం జిల్లా కోర్టు ప్రాంగణంలో ఘనంగా నిర్వహంచారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎపి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుమతీ జగడం హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి పార్థసారధి, రిటైర్డ్ జడ్జి ఎన్.జేసు రత్నకుమార్, పాస్టర్ రెవరెండ్ వై.యోహాన్‌రాజు పాల్గొన్నారు. బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కాసు వెంకటరెడ్డి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ అనురాధ, ట్రెజరర్ దేవదాసు, సీనియర్ న్యాయవాదులు యం.నాగేశ్వరరావు, డేవిడ్ లూదర్‌బాబు, సుభకర్, పెద్ద సంఖ్యలో న్యాయవాదులు పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్ పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి

విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డిప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం మంగళగిరి పట్టణంలో గల మున్సిపల్ హైస్కూల్లో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ పుస్తకాలు పంపిణీ చేశారు. హైస్కూల్లోచదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు పంపిణీ చేశారు. పదవ తరగతి తర్వాత ఏ కోర్సు చదివితే మంచిదో అనే విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో విజ్ఞానం ఇంజనీరింగ్ కాలేజీ ప్రొఫెసర్ దుర్గా, ఎం ఈ ఓ ఎన్ బాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ శ్రీనివాసరావు, పి మాధవి, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి 3
మంగళవారం 24 డిసెంబర్ 2024

నోటీసులు ఇవ్వకుండా తొలగింపులు

బాధితుల ఆవేదన

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఆక్రమణలు తొలగింపు పేరుతో ఎంటిఎంసీ పరిధిలోని కుంచనపల్లి అరవింద హై స్కూల్ ఎదురుగా పంట కాలవ రోడ్డులో ఉన్న టిఫిన్ బడ్డీలను, బార్బర్ షాపును, వెంకటేశ్వరస్వామి దేవస్థానం వెనుక ఉన్న రేకుల షెడ్డును తాడేపల్లి మున్సిపల్ అధికారులు సోమవారం ఉదయం కూల్చివేశారు. ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ఉదయాన్నే వచ్చి కూల్చివేశారని బాధితులు వాపోతున్నారు. జీవనోపాధి కోసం టిఫిన్ బండి పెట్టుకుని పొట్ట పోసుకుంటున్న అంటూ టిఫిన్ హోటల్ చిరు వ్యాపారి శ్రీదేవి లబోదిబోమంటున్నారు. గత ఐదు సంవత్సరాలుగా కుటుంబాన్ని పోషించుకునేందుకు జీవనోపాధిగా ఎంచుకున్న చిరు హోటలను అధికారులు కూల్చడం అన్యాయమని, అనుమతులు లేకుండా జాతీయ రహదారి పక్కన, గ్రామంలోను అనేక కట్టడాలు నిర్మించిన పట్టించుకోని అధికారులు చిరు వ్యాపారులపై ప్రతాపం చూపారు అంటూ పలువురు స్థానికులు వాపోతున్నారు. అనుమతులు లేకుండా అడ్డగోలుగా నిర్మించిన అనేక కట్టడాలు కళ్లెదురుగా ఉన్న పదిమందికి టిఫిన్ పెట్టే హోటల్ మాత్రమే కనబడిందా అంటూ వాపోతున్నారు. ఏ రోజుకు ఆరోజు టిఫిన్ బండి పై వచ్చే ఆదాయంతో గత ఐదు ఆరు సంవత్సరాలుగా జీవనం సాగిస్తున్న శ్రీదేవి అనే మహిళ హోటల్ కూల్చడం, టిఫిన్ బండిని తొలగించమనడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు.

అరవింద హైస్కూల్ ఎదురుగా కూల్చివేసిన టిఫిన్ బడ్డీవద్ద బాధితురాలు

యువకుడిపై పోక్సో కేసు నమోదు

ప్రజాశక్తి- మాచర్ల : బాలికతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న ఒక యువకుడు పై పోక్సో కేసు నమోదు చేసినట్లు మాచర్ల అర్బన్ ఎస్ఐ సంధ్యారాణి సోమవారం తెలిపారు. స్థానిక ఏడవ వార్డుకు చెందిన బాలికను అదే వీధిలో నివసిస్తున్న ఒక యువకుడు నిత్యం అభ్యంతరకరంగా ప్రవర్తిస్తున్నాడని మైనర్ బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఆ యువకుడు పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సంధ్యారాణి తెలిపారు.

ఆరుగురు జూదరులు అరెస్టు

ప్రజాశక్తి - తాడేపల్లి : క్రిష్టియన్ పేటలో గుట్టు చప్పుడు కాకుండా ఓ నివాసంలో పేకాట ఆడుతున్న 6 మంది జూదరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.12 వేల నగదు, 50 కాయిన్స్ స్వాధీనం చేసుకున్నా మని తాడేపల్లి సిఐ కళ్యాణ్ రాజు తెలిపారు.

ఇసుక లారీ స్వాధీనం

ప్రజాశక్తి- మాచర్ల : ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు మాచర్ల అర్బన్ ఎస్ఐ సంధ్యారాణి తెలిపారు. సోమవారం వాహనాలను తగ్గిచేస్తుండగా ఎపి37టి డి 5666 నెంబర్ గల లారీలో ఎటువంటి బిల్లులు లేకుండా ఇసుకను సరఫరా చేస్తున్నట్లు గుర్తించినట్లు ఎస్సై తెలిపారు. ఇసుక లారీని రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై సంధ్యారాణి తెలిపారు.

సైబర్ నేరాల పై నిర్వహించిన వ్యాసరచన పోటీలలో విజేతలకు మెమోంటో అందిస్తున్న ఎస్.పి. సతీష్ కుమార్, సదస్సుకు హాజరైనవారు

సైబర్ నేరాలపై నిఘా : ఎస్‌పి సతీష్‌కుమార్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సైబర్ నేరగాళ్ల బారిన పడి నష్టపోకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సాంకేతిక పరిజ్ఞానంపెంచుకోవాలని జిల్లా ఎస్పి ఎస్.సతీష్‌కుమార్ కోరారు. గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సోమవారం సైబర్ నేరాలపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అన్ని తరగతుల ప్రజలు ఎదో రూపంలో మోసపోతు న్నారన్నారు. చాలామంది సైబర్ మోసానికి గురైన గాని బయటకు చెప్పుకోలేక తమలో తాము సతమతమవుతున్నారని, అటు మానసికంగా, ఇటు ఆర్థికంగా ఎంతో కంగిపోయి ఏమి చేయలేని స్థితిలో ఉండిపోతున్నారని తెలిపారు. సైబర్ మోసాల పట్ల అవగాహన కలిగి ఉంటే ఆ మోసాలకు గురయ్యే అవకాశం ఉండదని ఒక వేళ మోసాలకు గురైనా వెంటనే వాటిని ధైర్యంగా ఎలా ఎదుర్కోవాలో తెలుసుకుని ఉండాలన్నారు. సైబర్ నేరగాళ్లు ఎక్కువగా మధ్య వయస్కుల వారిని, రిటైర్డ్ అయిన వారిని ఎంపిక చేసుకుంటూ వారిని మోసం చేస్తూ వస్తున్నారన్నారు. దీనికి ప్రధాన కారణం వారిలో సైబర్ మోసాలు మరియు సాంకేతిక పరిజ్ఞానం పట్ల సరైన అవగాహన లేకపోవడం వల్ల త్వరగా సైబర్ మోసానికి గురయ్యే అవకాశాలు ఉంటున్నాయన్నారు. ట్రేడింగ్ యాప్ లలో పెట్టుబడులు పెట్టడం, లాటరీ టికెట్ల లింకులు, ప్రైజ్ మనీ లింకులు, జాబ్ ఆఫర్ లింకులు నొక్కడం, వ్యాపార భాగస్వామ్య ఆశ కల్పించి ముందస్తు పెట్టుబడులు పెట్టించడం ఈ తరహా సైబర్ మోసాలు ఉదాహరణలని తెలిపారు. ఏదైనా సునాయసనంగా లబ్ధిపొందా లన్న భావనను విడనాడా లని, ఒకటికి రెండు సార్లు ఆలోచించుకుని, అనుభవం కలిగిన వారితో చర్చించి సంబంధిత పథకాల వైపు దృష్టి పెట్టాలన్నారు. సైబర్ నేరానికి లేదా మోసానికి గురైనప్పుడు వెంటనే 1930 అనే జాతీయ సైబర్ భద్రత సెల్ టోల్ ఫ్రీ నంబర్లో సంప్రదించి, తమకు జరిగిన మోసం గురించి తెలియచెప్పి, బయటపడటానికి తగిన సహాయాన్ని పొందవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమానికి వ్యాపారులు, ఉద్యోగులు, వివిధ అసోసియేషన్‌ల వారు హాజరు అయ్యారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన సైబర్ ఇంటిల్‌జెన్స్ డైరక్టర్ పాటిబండ్ల కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ సైబర్ నేరాలు రెండు రకాలుగా ఉన్నాయని కొన్ని ఆర్థికమైనవి, మరికొన్ని సామాజికమైనవన్నారు. సైబర్ నేరాలు ఎక్కువగా ఆన్లైన్ వేదికగా యువతను ఆకట్టుకొని వారిని బెదిరించి నగదు కాల్ చేస్తున్న సందర్భాలు ఎక్కువగా వెలుగులోకి వస్తున్నాయన్నారు.మహిళలను ఎవరైనా ట్రోలింగ్ చేసిన, ఫోటోలను మార్ఫింగ్ చేస్తాము అని బెదిరించిన భయపడకుండా వెంటనే దగ్గరలోని పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించాలన్నారు. పది అంకెల కంటే తక్కువగాని లేదా 10 అంకెల కంటే ఎక్కువగాని ఏదైనా నంబర్ నుండి ఫోన్ వస్తే అసలు మాట్లాడవద్దన్నారు. ఏదైనా అపరి చిత వ్యక్తుల నుండి వాట్సాప్ కాల్ గాని, వీడియో కాల్ గాని వస్తే ఆన్సర్ ఇవ్వద్దన్నారు. అదనపు ఎస్పిలు జి.వి.రమణమూర్తి, ఎ.హనుమంతు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణతో ప్రాణాలకు రక్షణ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని జిల్లా ఎస్పి సతీష్‌కుమార్ కోరారు. గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరం వద్ద సోమవారం ద్విచక్ర వాహనదారులకు నిర్వహించిన హెల్మెట్ ధారణ అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. యమధర్మరాజు వేషదారణలోని వ్యక్తి చేత హెల్మెట్ ధరించడంపై ద్విచక్ర వాహనాదారులకు అవగాహన కల్పిస్తున్న ఈస్ట్ ట్రాఫిక్ పోలీసులను ఆయన అభినందించారు. ప్రమాదానికి గురైనప్పుడు హెల్మెట్ ధరించడం వలన ఎంతో ఉపయోగం అన్నారు. తలకు బలమైన గాయాలు తగులకుండా మరణానికి గురయ్యే అవకాశాలు తగ్గుతాయని తెలిపారు.హెల్మెట్ ధరిస్తే రోడ్డు ప్రమాదాలు జరిగినప్పటికీ బతుకుతారని, లేదంటే చనిపోయి యమలోకాలకు వస్తారని సంబంధిత వేషదారణలో ఉన్న వ్యక్తి వివరించారు. ఎస్పితో పాటు అదనపు ఎస్పి హనుమంతు, డిఎస్పిలు రమేష్, అజీజ్, సిఐ అశోక్‌కుమార్, ఎస్ఐ రవీంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.

దావా సమన్లు

IN THE COURT OF THE HON'BLE PRL. CIVIL JUDGE(JUNIOR DIVISION):: SATTENAPALLI

OS No: 384/ 2023

Between:
Velagapudi Shaik Abdul Ravoof. ...Plaintiff
And
Pullapanthula Venkata Ramana Murthy ....Defendant

To.
Pullapanthula Venkata Ramana Murthy, S/o. Rama Krishna Rao,R/o. Flat No. 1-B, Door No. 5-72-57, Raga Sudha Apartments, Pandaripuram, Guntur.

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు పై కోర్టు నుండి దావా సమన్లు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు సమన్లు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని ది:04-02-2025 కి వాయిదా వేసినారు.కావున ఆ రోజున ఉ. గం.10-30 ని.లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గానీ లేక మీ వకీలు గారి ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలను తెలుపుకొనగలరు. లేనిచో శ్రీకోర్టు వారిచే చట్ట ప్రకారం తీర్మానించ బడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా తేది:04-02-2025

వాసం సూరి బాబు,
పి.శ్రీదేవి,
వాది తరపు అడ్వకేట్స్, గుంటూరు.

మహారాజశ్రీ నరసరావుపేట ప్రిన్సిపల్ సీనియర్ సివిల్‌జడ్జి సీనియర్ డివిజన్ వారి కోర్టులో

E.P. No. 60/2022 Dispute No. 08/2016

Between
M/s వెంకట తిరుమల చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్, నరసరావుపేట. ...DHR/ Petitioner
Vs
తాటికొండ రమేష్ మరియు ఇతరులు ... JDRs/ Respondents

JDR-2 : కత్తుల రాంబాబు తండ్రి : కోటయ్య, వయస్సు 42 సం॥లు, ఫ్లాట్ నెం. 405, కావేరి టవర్స్, శ్రీనివాసనగర్, నరసరావుపేట, పలనాడు జిల్లా.

JDR-4 : కత్తుల ఇందిర, భర్త : రాంబాబు, వయస్సు 36 సం॥లు, ఫ్లాట్ నెం. 405, కావేరి టవర్స్, శ్రీనివాసనగర్, నరసరావుపేట, పలనాడు జిల్లా.

పైన తెలియపరచిన Dispute No. 08/2016 కు సంబంధించి వెంకట తిరుమల చిట్‌ఫండ్ కంపెనీ వారు మీపై నరసరావుపేట ప్రిన్సిపల్ సీనియర్ సివిల్‌జడ్జి సీనియర్ డివిజన్ వారి కోర్టులో ఇ.పి. దాఖలు చేసియున్నారు. ఇందుకు సంబంధించి మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు జారీ చేసినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందు వలన పై నెంబరు E.P. 60/2022లో మీకు Under order 21, Rule 54 CPC ప్రకారం నోటీసులు జారీ కాగలందులకు గాను ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయ వలసినదిగా కోర్టువారు ఆర్డరు వేసినారు. కావున మీరు ది. 10-01-2025వ తేదీన ఉదయం 10-30 గం.లకు నరసరావుపేట ప్రిన్సిపల్ సీనియర్ సివిల్‌జడ్జి సీనియర్ డివిజన్ వారి కోర్టులో హాజరయి మీకు గల ఆక్షేపణలు స్వయంగా గానీ, లేక మీ తరపు న్యాయవాది ద్వారా గానీ తెలియజేసుకొన గలరు. లేనియెడల మీకు వ్యతిరేకంగా తీర్మానించబడునని తెలియజేయడమైనది.

వాయిదాతేది : 10-01-2025

నరసరావుపేట, పలనాడుజిల్లా.

ఇట్లు
డిహెచ్ఆర్ / పిటీషనర్ తరపు న్యాయవాది
ముత్తవరపు వెంకటేశ్వర్లు చౌదరి

మహారాజశ్రీ అద్దంకి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. No: 257/2021

Between :
పెద్ది వీరయ్య చౌదరి .....వాది
Vs
పెద్ది గురవయ్య మరియు ఇతరులు..... ప్రతివాదులు

To
D3) గిడ్డపాటి ఉదయశ్రీ W/o మోహన్, చలపాడు (గ్రామం,) పోస్టు, చేబ్రోలు (మండలం) గుంటూరు (జిల్లా) D.M.C.(3వ ప్రతివాది)

పై నెంబరు దావాను వాది దావా పరిహారములు పొందు నిమిత్తం దాఖలు చేసి ఉన్నారు. సదరు దావాలో 3 వ ప్రతివాదియైన మీరు ఇందును గూర్చి మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు దావా సమనులు పంపినప్పటికీ తీసుకొనుక కాలయాపన చేయుచున్నందున ఈ పత్రిక ప్రకటన ద్వారా సమనులు జారీ చేయవలసినదిగా శ్రీ కోర్టు వారు ఉత్తర్వులు ఇచ్చియున్నారు. ఇందు నిమిత్తమై మీకు ఏమైననూ అభ్యంతరములు ఉన్నయెడల 20-01-2025 వ తేది ఉదయం 10.30 ని.లకు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపు కొనవలెను. లేనిచో నీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

అద్దంకి **ఇట్లు**
21-12-2024 **పంచాగ్నుల రమేష్**
అడ్వకేట్, అద్దంకి బాపట్ల జిల్లా.
సెల్ : 99487 88290

Court Notice

IN THE COURT OF THE HON'BLE III ADDL. CIVIL JUDGE (JUNIOR DIVISION):: GUNTUR

I.A.No.530/2024 and O.S.No.494/2024

Between:
Thokala Nagaraja Kumari. ….Plaintiff(Petitioner)
And
Annapureddy Nagi Reddy ….Defendant(Respondent)

To,
Annapureddy Nagi Reddy, S/o.Annapureddy Sambi Reddy, R/o.Flat No.5B, 5 th Floor, K.R.Villas, Vidya Nagar Extension, Guntur-522007

పై నెంబరు దావాలో మరియు సదరు దావాలోని ఐ.ఎ.నెం:530/2024 ఇన్ ఓ.యస్.నెం.494/2024 పిటీషనులో ప్రతివాది(రెస్పాండెంటు) అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా నోటీసు/సమన్లు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీకు Substitute Service ద్వారా పేపరులో ప్రకటన ద్వారా తెలియపరచమని ఆర్డరు వేయగా, సదరు ఆర్డరు ప్రకారము మీరు ది:06-01-2025న ఉ.గం.10-30 ని.లకు పై తెలిపిన కోర్టునకు మీరు స్వయంగా కాని, మీ అడ్వకేటు ద్వారా గాని హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియపరచుకొనవలయును. లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించ బడునని తెలియపరచటమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా తేది:06-01-2025

యస్.మార్కండేయులు,
కంతేటి శ్రీనివాస రావు,
వాది/పిటీషనరు తరపు న్యాయవాదులు, గుంటూరు.

దావా సమన్లు

IN THE COURT OF THE HON'BLE PRL.CIVIL JUDGE(JUNIOR DIVISION):: GUNTUR

OS No: 1084/ 2019

Between:
State Bank Of India, RACPC, Guntur, Rep.by it's Manager-Recovery. ...Plaintiff
And
Kadiyala Srinivasa Rao &Another ...Defendants

To.
D-1: Kadiyala Srinivasa Rao, S/o. Surya Narayana, R/o.Garikapudi(Vil), Prathipadu(Md), Guntur Dt.,
D-2: G.Anil Kumar, Fathers name not known, R/o. #7-17-315/4, 2nd Line, Mallikarjunapeta, Guntur.

పై నెంబరు దావాలో 1 & 2వ ప్రతివాదులు అయిన మీకు పై కోర్టు నుండి దావా సమన్లు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు సమన్లు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని ది:27-01-2025 కి వాయిదా వేసినారు. కావున ఆ రోజున ఉ. గం.10-30 ని.లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గానీ లేక మీ వకీలు గారి ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలను తెలుపుకొనగలరు. లేనిచో శ్రీ కోర్టు వారిచే చట్ట ప్రకారం తీర్మానించ బడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా తేది:27-01-2025

కె.వి.ఆర్.హెచ్.ప్రసాద్,
వాది తరపు అడ్వకేట్,
రవీంద్ర నగర్, గుంటూరు.

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (JUNIOR DIVISION) :: TENALI

O.S. NO. 812/2023

Between:
Addanki Lakshmi ....Plaintiff
Vs.
Kesana Nageswara Rao & Others .... Defendants

To:
(D7) Kesana Revathi, D/o. Late Kesana Srinivasa Rao
(D8) Kesana Pavani, D/o. Late Kesana Srinivasa Rao,
D7 & D8 are R/o. Door No. 9-122, Somasundara-palem Village, Tenali Mandal, Guntur District, Tenali JCJC.

పై నెంబరు దావాలో పై తెల్పిన 7 మరియు 8వ ప్రతివాదికి పై కోర్టువారి ద్వారా పంపిన దావా సమన్లను మీరు తీసుకొనక కాలయాపన చేయు చున్నారు. కావున శ్రీ కోర్టువారు సబ్‌స్టిట్యూట్ ఉత్తర్వుల ప్రకారము ది.06-01-2025వ తేదీ ఉదయం గం.10-30 నిమిషములకు శ్రీ కోర్టువారి ఎదుట మీరు స్వయంగా గానీ, న్యాయవాది ద్వారా గానీ హాజరై మీ యొక్క ఆక్షేపణలు ఏమైనా వున్నచో తెలుపగలరు. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానం చేయబడును.

దిండు శ్రీనివాస్ B. Com, B.L.,
వాది తరుపున న్యాయవాది. తెనాలి.
సెల్ నెం : 9849229704.

వెయ్యి ఎకరాల్లో వరిపంటకు నష్టం

ప్రజాశక్తి-ఈపూరు : పంట దెబ్బతిన్న ప్రతి రైతునూ ఆదుకుంటామని ఎడిఎ బి.రవిబాబు అన్నారు. వర్షంతో దెబ్బతిన్న పంట పొలాలను ఆయన సోమవారం పరిశీలించారు. వర్షం కారణంగా మండలంలోని కొండ్రముట్ల, కొచ్చర్ల, శావల్యాపురం మండలంలో కనుమర్లపూడి, బొల్లాపల్లి మండలంలో కనుమలచెరువు, వెల్లటూరు గ్రామాల్లో వరి, మొక్కజొన్న, పొగాకు పంటలు దెబ్బతిన్నాయన్నారు. వినుకొండ డివిజన్ పరిధిలో వరి 1000 ఎకరాలు, మొక్కజొన్న 75 ఎకరాలు, పొగాకు 35 ఎకరాల పంటకు నష్టం వాటిలినట్లు ప్రాథమిక అంచనాలను ప్రభుత్వానికి నివేదించినట్లు తెలిపారు. పంట రక్షణలో భాగంగా రైతులు వరిలో నిల్వ ఉన్న నీటిని బయటికి పంపాలన్నారు. ఓదెలను గట్లపై వేసి రెండు శాతం ఉప్పు ద్రావణాన్ని ఓదెలపై పిచికారి చేయాలని సూచించారు. రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలో కొనుగోలు చేసేలా చర్యలు చేపడతామన్నారు. పరిశీలనలో బొల్లాపల్లి ఏవో అబ్బూరి అంకారావు, గ్రామ వ్యవసాయ సహాయకులు కిషోర్ పాల్గొన్నారు.

రైతుసేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి - మాచర్ల : ధాన్యాన్ని రైతుసేవ కేంద్రాల ద్వారా ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేస్తుందని, దళారులను రైతులు ఆశ్రయించవద్దని మండల వ్యవసాయాధికారి లక్ష్మారెడ్డి సూచించారు. ఈ మేరకు పలు గ్రామాల్లో ధాన్యం పండించిన రైతులను కలిసి మాట్లాడారు. క్వింటాళ్‌కు రూ.2,320 మద్దతు ధరతో పాటు గోనె సంచులు, రవాణా ఖర్చులు కూడా ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. ధాన్యం అమ్మిన రైతులకు ఆలస్యమేమీ లేకుండా నగదునూ వారి ఖాతాల్లో జమ చేస్తున్నట్లు చెప్పారు. పంటను అమ్ముకోవాలనుకునే రైతులు తమ ఆధార్ నంబర్‌తో రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేయించుకోవాలని, పంట నమూనాలను అందించి పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు.

27న మాచర్లలో మినీ జాబ్‌మేళా

ప్రజాశక్తి- మాచర్ల రూరల్ : డిపార్ట్మెంట్ ఆఫ్ స్కిల్స్ డెవలప్మెంట్ అండ్ ట్రైనింగ్ అధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సీడాప్ అధ్వర్యంలో ఈనెల 27న మాచర్ల పట్టణంలోని శ్రీకాసుబ్రహ్మానందరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు మినీ జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఈ.తమ్మాజిరావు, ఎస్‌కెబిఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్ మేళాలో అమర రాజా గ్రూప్ ఆఫ్ కంపెనీ, అక్రో సాఫ్ట్ సొల్యూషన్, మెడ్ ప్లస్ ఫార్మసీ, ఇన్నోవ్ సోర్స్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు పాల్గొంటాయని, ఎంపికైన వారి విద్యార్హతను బట్టి సుమారు రూ.12,500 నుండి రూ.25 వేల వరకూ జీతం ఉంటుందని తెలిపారు. ఇంటర్, ఐటిఐ, డిగ్రీ, బీ.టెక్, డిప్లొమా, ఫార్మసి, పీజీ చదివిన 18-50 ఏళ్ల వారు జాబ్‌మేళాకు హాజరవ్వొచ్చని పేర్కొన్నారు. వచ్చేవారు బయోడేటా, ఎడ్యుకేషన్ సర్టిఫికెట్స్ జిరాక్స్, ఆధార్ నకలు, పాస్ పోర్ట్‌ఫొటోతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు ఆర్.కిరణ్ నాయక్ 7842747682, ననిక్య నాయక్ 9010585360 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

సిఎం నుండి పింఛను తీసుకునే వారిని ఎంపిక చేయండి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నూతన సంవత్సరం మొదటి రోజు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురజాల నియోజకవర్గం పులిపాడు పర్యటన నేపథ్యంలో నిర్వహించే గ్రామ సభలో అవసరమయ్యే సమగ్ర సమాచారాన్ని క్రమ పద్ధతిలో క్రోడీకరించి సిద్ధంగా ఉంచుకోవాలని అధికారులను పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. సిఎం పర్యటన ఏర్పాట్లపై అధికారులతో కలెక్టర్ పులిపాడులోని టిటిడి కళ్యాణ మండపంలో సోమవారం సమీక్షించారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయం చేసుకుని ముఖ్యమంత్రి నుండి పింఛను అందుకునే లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. గ్రామసభ కోసం స్థానిక ప్రభుత్వ పాఠశాల సమీపాన ఉన్న ఖాళీ స్థలాన్ని ప్రాథమికంగా ఎంపిక చేశారు. హెలీప్యాడ్ నుంచి సభ ప్రాంగణం వరకూ రహదారులకు మరమ్మతులు చేయాలన్నారు. పారిశుధ్య కార్యక్రమాలు చేయించాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, అదనపు ఎస్‌పి జెవి సంతోష్, ఆర్డీఓ మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయ అధికారి మురళి, డిపిఒ విజయ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏర్పాట్లపు పరిశీలిస్తున్న పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు తదితరులు

రాజ్యాంగాన్ని రూపుమాపే కుట్రతోనే ఆ వ్యాఖ్యలు

అమిత్‌షా క్షమాపణాలు చెప్పాలని ప్రజాసంఘాల ధర్నా, ర్యాలీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా స్థానిక చెరువుకట్ట సెంటర్‌లో ప్రజావేదిక, సిపిఎం, బిసి సంక్షేమ సంఘం, దళిత సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేశారు. అంటరానితనం, అస్పృశ్యత నివారణకు అంబేద్కర్ ఎంతో కృషి చేశారని, ఆయన రచించిన రాజ్యాంగం వల్ల అట్టడుగున ఉన్న దళితులకు, వెనుకబడిన బిసి, ముస్లిమ్ మైనారిటీ వర్గాల ప్రజలు అన్ని రంగాల్లో రాణించే అవకాశం వచ్చిందని చెప్పారు. అంబేద్కర్ వాదాన్ని రూపుమాపి మనువాద రాజ్యాంగ అమలుకు కేంద్రంలో బిజెపి ప్రభుత్వం యత్నిస్తోందని, ఈ క్రమంలో కేంద్ర మంత్రి అమిత్ షా అనుచిత వ్యాఖ్యలు చేశారని అన్నారు. అమిత్ షా తన వ్యాఖ్యలను వెనకకు తీసికొని క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం అంబేద్కర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. చెరువుకట్ట సెంటర్ నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ బి.నిర్మలకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్.వెంకటేశ్వర రాజు, కౌలురైతు సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి కె.రామారావు, బిసి సంక్షేమ సంఘం నియోజకవర్గ ఉపాధ్యక్షులు ఎస్.తిమ్మ రాజు, నాయకులు ఎం.వెంకటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బి.బాలకోటయ్య, మాజీ సర్పంచ్ టి.జయమ్మ, దళిత సంఘాల నాయకులు డి.దిబ్బయ్య, ఎం.బాబు, చిన్నా పాల్గొన్నారు.

అంబేద్కర్ చిత్రపటానికి పాలాభిషేకం..

ఖోఖో పోటీల్లో 'విక్టరీ' జట్టు విజయం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంతర కళాశాల ఖోఖో పురుషుల పోటీల్లో తమ విద్యార్థులు విజేతలుగా నిలిచారని నరసరావుపేటలోని విక్టరీ డిగ్రీ కళాశాల సెక్రెటరీ-కరెస్పాండెంట్ సుబ్బారెడ్డి, డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. ఈ నెల 21, 22 తేదీల్లో గుంటూరులోని టి.జెసియస్ కళాశాలలో నిర్వహించిన పోటీల్లో ఈ ఘనత సాధించినట్లు చెప్పారు. రెండేళ్ల నుండి ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంతర కళాశాల ఖో ఖో పోటీలలో విక్టరీ డిగ్రీ కాలేజ్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తూ ప్రథమ స్థానం సాధిస్తున్నారని చెప్పారు. దీంతోపాటు యూనివర్సిటీ జట్టుకు తమ విద్యార్థులు పి.సైదారావు, డి.రమణారెడ్డి, ఎమ్.అవినాష్, కె.రామక్రిష్ణ, బి.ప్రదీప్ ఎంపికయ్యారని చెప్పారు. ఈ సందర్భంగా కాలేజీలో సోమవారం ఏర్పాటు చేసిన అభినందన సభలో విద్యార్థులను సుబ్బారెడ్డి, శ్రీనివాసరావుతో పాటు ప్రిన్సిపాల్ పి.వేణుగోపాల్, పీడీ ఎన్.కృష్ణంరాజు, ఇతర అధ్యాపకులు అభినందించారు.

విజయం సాధించిన జట్టుతో విక్టరీ కాలేజీ యాజమాన్యం

సౌత్‌జోన్ ఖోఖో పోటీలకు 'కృష్ణవేణి' విద్యార్థులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : సౌత్‌జోన్ పురుషుల ఖోఖో పోటీలకు తమ కళాశాల విద్యార్థులు పి.గోపీనాథ్, షేక్ అల్లాబక్షు ఎంపికయ్యారని నరసరావుపేటలోని కృష్ణవేణి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. ఈ నెల 21,22 తేదీల్లో గుంటూరులోని టిజెపిఎస్ కళాశాలలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంతర కళాశాలల పురుషులు ఖోఖో పోటీల్లో తమ కళాశాల జట్టు తృతీయ బహుమతి సాధించిందని చెప్పారు. ప్రతిభ చాటిన తమ విద్యార్థులు ఈనెల 28, 29, 30 తేదీల్లో తమిళనాడు సెంట్రల్ యూనివర్సిటీలో జరగనున్న దక్షిణ భారత విశ్వ విద్యాలయాల పోటీల్లో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పురుషుల ఖోఖో జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని కళాశాల పీడీ ఈదర ఆదిబాబు తెలిపారు. ఎంపికైన వారిని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎం.ఆర్.కె సతీష్‌బాబు, కోచ్ ఎస్.కె మహమ్మద్ అభినందించారు.

నిరుద్యోగులైన స్నేహితులనే మోసం చేసి...

సమస్యలు వింటున్న పల్నాడు ఎస్పీ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

గ్రీవెన్స్‌కు వచ్చిన ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను పల్నాడు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు ఆదేశించారు. నరసరావుపేటలోని పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుండి ఆర్థిక, కుటుంబ, ఇతర వివాదాలకు సంబంధించి 63 ఫిర్యాదులను ఆయన స్వీకరించారు.

రూ.5 లక్షలు కాజేసిన బ్యాంక్ మేనేజర్

ఈ ఏడాది ఏప్రిల్‌లో నరసరావుపేట హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్‌లో సొసైటీ పేరుతో ఖాతా తెరిచేందుకు వెళ్లగా ఖాతా తెరవాలంటే రూ.5 లక్షలు డిపాజిట్ చేయాలని చెప్పడంతో రూ.5 లక్షలు డిపాజిట్ చేశానని, అయితే బ్యాంకు మేనేజర్ సొంటి రఘురాం ఆ డబ్బును అతని సొంత అవసరాలకు వాడుకున్నాడని ఈపూరు మండలం ఆరేపల్లి ముప్పాళ్లకు చెందిన సొసైటీ మెంబర్ ముప్పాళ్ల కోటేశ్వరరావు ఫిర్యాదు చేశారు. ఖాతాకు నగదు జమ కాకపోవడంతో మేనేజర్‌ను పలుమార్లు ప్రశ్నించగా దుర్భాషలాడాడని, ఈ విషయాన్ని బయటకు చెప్తే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరింస్తున్నారని తెలిపారు. దీనిపై విచారణ జరిపి న్యాయం చేయాలని, బ్యాంక్ మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

స్నేహం ముసుగులో రూ.11.36 లక్షల మోసం

స్నేహాన్ని ఆసరాగా చేసుకుని నిరుద్యోగులమైన తమకు ఆశ చూపి రూ.11.36 కాజేశాడని స్నేహితునిపై మరో ఇద్దరు ఫిర్యాదు చేశారు. నకరికల్లు మండలం కండ్లగుంటకు చెందిన కూనాల రాజేష్, కుంబా కార్తీక్, జడా గణేష్‌లు స్నేహితులు. జడా గణేష్ మూడేళ్ల క్రితం విదేశాలకు వెళ్లాడు. జర్మనీలో ఉద్యోగం చేస్తున్నానని, ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయని, మీరు కూడా జర్మనీ రావాలని చెప్పాడని తెలిపారు. దీనికి సంబంధించి కూనాల రాజేష్ వద్ద పలు దఫాలుగా రూ.10.30 లక్షలు, కుంబా కార్తీక్ వద్ద రూ.1.36 లక్షలు తీసుకొని జర్మనీ తీసుకువెళ్లకుండా, డబ్బులు వెనక్కు ఇవ్వకుండా మోసం చేశారని తెలిపారు. ఇటీవల గ్రామానికి వచ్చిన గణేష్‌ను నిలదీయగా చంపేస్తానని బెదిరింస్తున్నాడని, దీనిపై విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరారు.

కూనాల రాజేష్

కుంబా కార్తీక్

చండీఘర్ డిస్కం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రేపు నిరసన

ప్రజాశక్తి-గుంటూరు

చండీఘర్ డిస్కం విద్యుత్‌ను కార్పొరేట్ సంస్థ అయిన ఎమినెంట్ ఎలక్ట్రిసిటీ లిమిటెడ్‌కు అమ్మటాన్ని నిరసిస్తూ డిసెంబర్ 25న దేశవ్యాప్తంగా సిఐటియు పిలుపులో భాగంగా గుంటూరు మార్కెట్ సెంటర్‌లో జరిగే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దండా లక్ష్మీనారాయణ, వై.నేతాజీ, జిల్లా కార్యదర్శి బి లక్ష్మణరావు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో చండీగర్ పోరాటానికి మద్దతుగా జరిగే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పంజాబ్ హర్యానా రాష్ట్రాలకు రాజధానిగా ఉన్న కేంద్ర పాలిత ప్రాంతమైన చండీఘర్ విద్యుత్ సంస్థ ప్రైవేటీకరించడానికి సిఐటియు తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. చండీగర్ విద్యుత్ పోరాటంలో పాల్గొన్న ఉద్యోగ కార్మికులకు సిఐటియు సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందన్నారు. డిసెంబర్ 31 నాటికి చండీగర్ డిస్కం ఆస్తులను ప్రైవేట్ కంపెనీలకు ధారాదత్తం చేయడం కోసం బిజెపి ప్రభుత్వం అన్ని రకాల ప్రయత్నాలు తీవ్రతరం చేసిందన్నారు.దీనికి వ్యతిరేకంగా గత నాలుగు సంవత్సరాలుగా ఉద్యోగులు కార్మికులు పెద్ద ఎత్తున పోరాడుతున్నారన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పవర్ గ్రిడ్ సబ్ స్టేషన్ ప్రైవేటు వారికి అమ్మేందుకు సిద్ధం చేశారన్నారు. స్మార్ట్ మీటర్లు పెట్టి విద్యుత్తు సబ్సిడీలు ఎత్తివేసి ప్రజలపై భారాలు వేయడం కోసం రంగం సిద్ధం చేశారన్నారు. చండీఘర్ విద్యుత్ ఉద్యోగ కార్మికుల పోరాటానికి మద్దతుగా, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగు నిరసన కార్యక్రమాల్లో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి నాగరాజు, సిహెచ్ శ్రీనివాసరావు, జి రమణ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు వై నేతాజీ, లక్ష్మీనారాయణ, లక్ష్మణ్ తదితరులు

ఇళ్ల నిర్మాణ లక్ష్యాలను పూర్తి చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు : హౌసింగ్ లే అవుట్లలో ఇళ్ల నిర్మాణాలను ప్రతి వారం నిర్దేశించిన లక్ష్యాలను ఖచ్చితంగా అధిగమించే విధంగా హౌసింగ్ అధికారులు పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ నాగలక్ష్మీ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 డిమాండ్ సర్వేలో నమోదు చేసి ఇళ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవా లన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సక్షమ్ ద్వారా మంజూరు చేసిన త్రాగునీరు సరఫరా, మరుగుదొడ్ల నిర్మాణం, పోషణ్ వాటికల ఏర్పాటు పూర్తిచేసి వినియో గంలోకి తీసుకురావాలని సూచించారు. యన్‌పిసిఐ క్రింద బ్యాంక్ అకౌంటుకు ఆధార్ కార్డును అనుసం ధానం ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. సమావేశంలో హౌసింగ్ పీడీ ప్రసాదు, ఈ.ఈ శంకర్, పంచాయ తీరాజ్ ఎస్ఈ బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షాను కేబినెట్ నుండి బర్తరఫ్ చేయాలి

గ్రీవెన్స్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకుల ఫిర్యాదు

ప్రజాశక్తి -గుంటూరు

భారత రాజ్యాంగ రూప శిల్పి, రాజనీతి కోవిదుడు, భారతరత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ గురించి కేంద్ర హెూం మంత్రి అమిత్‌షా రాజ్యసభలో తీవ్ర అభ్యంతకరంగా, అమర్యాదకరంగా మాట్లాడారని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చిలకా విజయ్‌కుమార్ అన్నారు. అమిత్‌షా వ్యాఖ్యలను ఖండిస్తూ సోమవారం గ్రీవెన్స్‌లో కాంగ్రెస్ నాయకులు అర్జీ అందచేశారు. కలెక్టర్ ద్వారా రాష్ట్రపతికి తెలియజేసి, కేంద్ర క్యాబినెట్ నుంచి అమిషాను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఆఫీస్ ఇంచార్జి బిళ్ళా సునిల్, పాలపటి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులు దహనం

తాడేపల్లిలో

ఉండవల్లి అంబేద్కర్ నగర్

ప్రజాశక్తి - తాడేపల్లి : పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోవాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో ఉండవల్లి అంబేద్కర్ నగర్ లో ఆదివారం నాడు విద్యుత్ బిల్లులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి మాట్లాడుతూ నిత్యవసర వస్తువుల దరల పెరుగుదలతో ప్రజలు సతమతమవుతుంటే అవి చాలా వన్నట్లు విద్యుత్ చార్జీల భారాన్ని ప్రజలపై మోపడం సరైనది కాదని అన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణం ఉపసంహరించుకోవాలని రవి డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఉన్న విద్యుత్తు మీటర్ల స్థానంలో ఆదాని స్మార్ట్ మీటర్లు పెట్టి వాటి భారాన్ని కూడా ప్రజలపై ఎందుకు మోపుతున్నారని ప్రశ్నించారు. ఆదాని స్మార్ట్ మీటర్లను అమర్చటం వెంటనే నిలిపివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాజధాని డివిజన్ నాయకులు వల్లభాపురం వెంకటేశ్వరరావు సంకురు ఇమ్మానియేల్ రాజు, కంచర్ల శేషయ్య, బి.కోటేశ్వరరావు ఓలేటి రమేష్, కే.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తాడేపల్లి : విద్యుత్ చార్జీలకు వ్యతిరేకం గా భవన నిర్మాణ కార్మిక సంఘం(సిఐటియూ) ఆధ్వర్యంలో సుందరయ్య నగర్ బత్తుల రాజు భవన్ వద్ద కార్మికులు నిరసన తెలిపిన బిల్లు లు దహనం చేశారు. కార్యక్రమంలో సిఐటియూ నాయకులు కొట్టే కరుణాకరరావు సియచ్ భుజంగరావు, శేఖర్ శాయి వేంకటేష్ సుబ్బయ్య శివ గోపి బాజీ చిన్నారావు ప్రభాకర్ శివాజీ తదితరులు పాల్గొన్నారు

తెనాలిలో

ప్రజాశక్తి-తెనాలిరూరల్ : విద్యుత్ మీటర్లు మర్చొద్దు, పెంచిన విద్యుత్ చార్జీలను రద్దు చేయాలని కోరుతూ స్థానిక సుల్తానాబాద్‌లో ముఠా నాయకులు సోమవారం విద్యుత్ బిల్లులను తగలబెట్టారు. ఇంటింటికి కర పత్రాలు పంచి ప్రచారం చేసారు. విద్యుత్ బిల్లుల భారాన్ని తెలియజేస్తూ బిల్లులను తగలబెట్టారు. స్థానిక సిపిఎం నాయకులు కె బాబు ప్రసాద్ మాట్లాడుతూ నీతిమాలిన విధానాలను ప్రజలు తిప్పికొట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో షేక్ హుస్సేన్ వలి, జి వెంకటసుబ్బయ్య, జి రాంబాబు, కె శ్రీనివాసరావు, వి పోతిరెడ్డి, పవన రెడ్డి, పి మురళీకష్ణ రెడ్డి, వి శ్రీనివాసరావు, డి రత్నబాబు, కె పాపిరెడ్డి, వి శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలి

ప్రజాశక్తి - ఫిరంగిపురం

పొనుగుపాడు గ్రామంలోని ఎస్టీ కాలనీలో పార్లమెంట్లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను హేళన చేస్తూ మాట్లాడిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలని, కాపాడుకుందాం భారత రాజ్యాంగాన్ని అని, మతోన్మాదం నశించాలని, అమిత్ షా డౌన్ డౌన్ పెద్ద ఎత్తున నినాదాలు చేసి నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు నాగేశ్వరరావు, జగజీవన్, పెంటయ్య, రమేష్, మస్తాన్ సిఐటియు ఫిరంగిపురం మండల కార్యదర్శి షేక్ మస్తాన్వలి తదితరులు పాల్గొన్నారు.

పొనుగుపాడు నిరసనలో మాట్లాడుతున్న మస్తాన్‌వలి

అభివృద్ధి పనులపై నాయకులతో ఎమ్మెల్యే భేటి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో చేపట్టవలసిన అభివృద్ధి పనులు, సమస్యలపై పార్టీ నేతలతో ఎమ్మెల్యే గళ్ళా మాధవి సోమవారం తన క్యాంపు కార్యాలయంలో పార్టీ నేతలతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో ప్రధానంగా సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఎక్కడ అవసరం అవుతాయో గుర్తించాలని, కాలువలు శుభ్రపరచి, ఫాగింగ్ నిర్వహించాలని స్థానిక అధికారులను కోరాలన్నారు. వీధి దీపాలు, కుక్కల సమస్యలను వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. స్థలం ఉన్న వారికి ఇంటి నిర్మాణంకు గృహ నిర్మాణ శాఖ ఆర్థిక సహాయం చేస్తున్నదని డివిజన్‌లలో ఉన్న ప్రజలకు ఈ పథకం పై అవగాహన కల్పించి, సమీప సచివాలయాల్లో లబ్ధిదారులుగా పేర్లు నమోదు చేయించాలని సూచించారు.

సమావేశంలో మాట్లాడుతున్న దండా లక్ష్మీనారాయణ

లక్ష్మణరావును మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిపించాలి

ప్రజాశక్తి - చేబ్రోలు : గుంటూరు, కృష్ణ ఉమ్మడి జిల్లాల గ్రాడ్యుయేట్స్ అభ్యర్థిగా తిరిగి పోటీ చేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావుకు మండలంలోని పట్టభద్రులందరూ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ పట్టభద్రులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం చేబ్రోలు లోని ఉపాధ్యాయ భవన్లో సిహెచ్ హనుమంతరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుద్యోగుల సమస్యలపై గత ఐదు సంవత్సరాలుగా పోరాటం చేసిన వ్యక్తి కేసు లక్ష్మణరావు అని అన్నారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి నిరుద్యోగ సమస్యను పరిష్కరించడానికి అనేక పోరాటాలను లక్ష్మణరావు చేశారని, అంగన్వాడి సమస్యల పరిష్కారంలో, ముం దుండి పోరాడిన వ్యక్తి అని, భవన నిర్మాణ సంక్షేమ బోర్డు పునరుద్ద రించాలని, కార్మికుల ఉద్యోగుల సమస్యలపై శాసన మండలిలో పోరాడిన లక్ష్మణరావును తిరిగి గెలిపించుకోవాలని తెలిపారు. అనంతరం గ్రాడ్యుయేట్స్ మండల సమన్వయ కమిటీ కన్వీనర్ గా ఐ శ్రీనివాసరావు, కో కన్వీనర్ గా సిహెచ్ హనుమంతరావు తదితరులతో నూతన కమిటీ ఎన్నుకున్నారు.

కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నాలో మాట్లాడుతున్న ఎస్ఎస్ చంగయ్య

సూపర్‌వైజర్‌ను విధుల నుండి తొలగించాలి

నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - మంగళగిరి

ఆత్మకూరులో మున్సిపల్ కార్మికులపై అసభ్య పదజాలంతో దుర్భాషలాడిన సూపర్‌వైజర్ కజిమాను వెంటనే విధులనుండి తొలగించాలని యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ చంగయ్య డిమాండ్ చేశారు. ఇబ్బందులు పడుతున్నప్పటికీ పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న సిబ్బందిని అనుచితంగా సూపర్‌వైజర్ మాట్లాడటం శోచనీయమన్నారు. కార్మికులను దుర్భాషలాడిన సూపర్‌వైజన్‌ను విధుల నుండి తొలగించాలని కోరుతు సోమవారం ఏపీ.మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) నగర కమిటీ ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ వద్ద సోమవారం సాయంత్రం ధర్నా నిర్వహించారు. ఈ ఈ ధర్నా నుద్దేశించి నగర యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ చెంగయ్య మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న ఈపీఎఫ్, ఈఎస్ఐ, సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. స్కానర్ల సమస్య వెంటనే పరిష్కరించాలని అని అన్నారు. అనంతరం కమిషనర్‌కి వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ పట్టణ అధ్యక్షులు పేరం పూర్ణచందర్రావు,ఉపాధ్యక్షులు యన్నం శివ నాగేశ్వరరావు, ముద్రబోయిన శ్రీనివాసరావు, కటారి ఆంజనేయులు, శివరాత్రి అంజిబాబు, కార్యదర్శి బండి గిరిబాబు, పేరం తిరుపతమ్మ, పచ్చల దుర్గ పాల్గొన్నారు.

మహిళా జవాన్ మహాలక్ష్మికి ఘన సన్మానం

ఎన్ఎస్ఎస్ఎం పాఠశాలను సందర్శించిన పూర్వ విద్యార్థిని, బిఎస్ఎఫ్ జవాన్ మహాలక్ష్మి

ప్రజాశక్తి-తెనాలిరూరల్

భారత రక్షణ రంగంలో ఒకటైన బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ సాయుధరాలిగా విధులు నిర్వహిస్తున్న ఐతానగర్ ఎన్ఎస్ఎస్ఎం పాఠశాల పూర్వ విద్యార్థిని ఏద్దు మహాలక్ష్మిని పాఠశాల యాజమాన్యం సోమవారం ఘనంగా సన్మానించారు. బిఎస్ఎఫ్‌లో జవానుగా విధులు నిర్వర్తిస్తూ సెలవుల్లో మొదటిసారి తెనాలి వచ్చిన మహాలక్ష్మిని ఎన్ఎస్ఎస్ఎం పాఠశాల ఎన్‌సిసి విద్యార్థులు మార్చ్ ఫాస్ట్ నిర్వహించి ఘనంగా స్వాగతం పలికారు. మండల విద్యాశాఖ అధికారి-2 వి జయంతి బాబు పుష్పగుచ్చం అందించి సభ వేదికపైకి ఆహ్వానం పలికారు. అనంతరం పాఠశాల విద్యా కమిటి ఛైర్మెన్ కిరణ్, ప్రసూనదేవి, సంపూర్ణ, నీలిమ, కరీముల్ల, మనోజ్ తదితరులు పూలమాలలు వేసి అభినందించారు. 6 నుంచి పదివరకు తమ పాఠశాలలో విద్యనభ్యసించిన మహాలక్ష్మి దేశరక్షణలో భాగమైనందుకు ఎంతో సంతోషంగా ఉందని పాఠశాల ప్రధానోపాధ్యాయిని సునీత అన్నారు. అనంతరం మహాలక్ష్మి మీడియాతో మాట్లాడారు. పాఠశాల దశలో ఎన్‌సిసి ఎ సర్టిఫికెట్ పొంది పదోతరగతి అనంతరం డిప్లొమాలో ఈఈఈ పూర్తి చేసానన్నారు. దేశానికి సేవ చేయాలన్నా లక్ష్యంతో 2023 అక్టోబరులో భారతరక్షణ రంగాల్లో ఒకటైన బిఎస్ఎఫ్ కు ఎంపికయ్యానన్నారు.

మహాలక్ష్మిని సన్మానించి కిరీటం పెట్టిన కోచ్ బాలయ్య, పక్కన పాఠశాల ఉపాధ్యాయులు

అనంతరం పశ్చిమ బెంగాల్ లో శిక్షణ పూర్తి చేసుకుని అక్కడే 93వ బెటాలియన్‌లో విధుల్లో చేరానన్నారు. 2023 మేలో హైదారాబాద్ లో జరిగిన పరుగు పోటీల్లో ఉభయ రాష్ట్రాల్లో 48 మంది పోటీపడి ఆరుగురు మాత్రమే బిఎస్ఎఫ్ కు ఎంపికయ్యామని వారిలో తాను ప్రథమ స్థానంలో ఎంపికైనట్లు తెలిపారు. తన తల్లితండ్రులు, గురువులతో పాటు తెనాలి ఐతానగర్ ప్రాంతానికి చెందిన క్రీడా శిక్షకులు గెడ్డటి బాలయ్య, భాస్కర్ లు ఎంతో ప్రోత్సాహం అందించారని అన్నారు. పాఠశాల దశలో ఉత్తమ విద్యార్థులుగా తమను తాము రూపు దిద్దుకోవాలని సూచించారు. మహిళలు తలచుకుంటే ఎంతటి శిఖరానైనా అధిరోహిస్తారని వెన్నుతట్టి ప్రోత్సహించాలన్నారు.

అమరావతి ఎస్సైగా అమీర్

ప్రజాశక్తి - అమరావతి

అమరావతి నూతన ఎస్సైగా కె.అమీర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. తొలుత అమరావతి సీఐ మాకినేని శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

టీడీపీ శాశ్వత సభ్యత్వం పొందిన వెంకట కిషోర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రొంపిచర్ల మండలం కర్లకుంట గ్రామానికి చెందిన టిడిపి రాష్ట్ర యువ నాయకులు వడ్లమూడి వెంకట కిషోర్ ఆ పార్టీ శాశ్వత సభ్యత్వం పొందారు. ఈ మేరకు సోమవారం నరసరావుపేట టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు చేతుల మీదుగా శాశ్వత సభ్యత్వ కార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చదలవాడతోపాటు, టిడిపి రొంపిచర్ల మండల అధ్యక్షుడు పులుకూరి జగ్గయ్య, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు శాఖమూరి మారుతీ, నాయకులు షేక్ నాగూర్ తదితరులు ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ టిడిపి బలోపేతానికి యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

'అమిత్‌షా వ్యాఖ్యలు సిగ్గుచేటు'

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని పల్నాడు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, సీనియర్ న్యాయవాది గర్నెపూడి అలెగ్జాండర్ సుధాకర్ డిమాండ్ చేశారు. సోమవారం పల్నాడు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేద్కర్ లేకపోతే అమిత్‌షాకు మంత్రి పదవి దక్కేదా? అని ప్రశ్నించారు. బేషరుతుగా క్షమాపణ చెప్పి వెంటనే మంత్రి పదవికి, పార్టీకి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సీదా కృష్ణారావు, చుండి కొండలరావు, మొలత్రాటి ప్రవీణ్, ఖాజా, పూర్ణచంద్రరావు, ప్రేమ్, బ్రహ్మయ్య, నాగార్జున, గోదా రమేష్, రవి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలిండియా

సౌత్‌జోన్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-ఈపూరు

మండలంలోని ఎ.ముప్పాళ్ళ ధనలక్ష్మి వ్యాయామ కళాశాల విద్యార్థులు ఎస్.హిమబిందు, ఎం.వంశీ ఆల్ ఇండియా సౌత్ జోన్ విశ్వవిద్యాలయం పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ చుండు వెంకటరావు సోమవారం తెలిపారు. హిమబిందు ఈ నెల 20న ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన రెజ్లింగ్ పోటీలలో ప్రతిభ కనబరిచి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం జట్టుకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. పంజాబ్ రాష్ట్రంలోని గురు కాశీ యూనివర్సిటీలో జరిగే రెజ్లింగ్ పోటీలలో పాల్గొంటుందని తెలిపారు. వంశీ ఈ నెల 21, 22వ తేదీలలో గుంటూరులోని టిజేపిఎస్ కళాశాలలో జరిగిన ఖోఖో పోటీలలో పాల్గొని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం జట్టులో స్థానం సాధించి తమిళనాడు రాష్ట్రంలోని సెంట్రల్ యూనివర్సిటీలో జరిగే ఖోఖో పోటీలలో పాల్గొంటున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థులను కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ మేదరమెట్ల రామశేషగిరిరావు, అధ్యాపకులు ఆర్.బలరాం నాయక్, సిహెచ్ అరవింద్, ఎం.దాస్, కె.వంశీ అభినందించారు.

దేశ ఆర్థిక ప్రగతికి నాంది పలికిన పీవీ

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

ఆర్థిక విప్లవాన్ని సృష్టించి దేశ ప్రగతికి నాంది పలికిన మహోన్నత వ్యక్తి దివంగత పీవీ నరసింహారావు అని సత్తెనపల్లి శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మాజీ ప్రధాని, భారతరత్న పీవీ నరసింహారావు వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భగా స్టేషన్ రోడ్డులో ఉన్న పీవీ నరసింహారావు విగ్రహానికి లక్ష్మీనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక సంస్కరణలు అమలు చేసి దేశాభివృద్ధికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ఆయన ఆశయాలను కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు డాక్టర్ శ్రీధర్, మారుతి పాల్గొన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే కన్నా

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి పట్టణం రఘురామ్ నగర్ కన్నా కార్యాలయంలో.టిడిపి ఆద్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు సోమవారం నిర్వహించారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొని, క్రిస్మస్ కేక్ కట్ చేశారు. క్రైస్తవ సోదరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వైరామస్వామి, డి.నాగేశ్వరావు మార్క్, గుంటూరు ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

కేకు కట్ చేస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

పోలీసులంటే పాలకులకు పట్టదా..?!

ప్రజాశక్తి - చిలకలూరిపేట

ఆపదలో ఉంటే ముందుగా గుర్తొచ్చేది పోలీసులే. ఎండనక, వాననక.. పగలూరాత్రీ తేడా లేకుండా పని చేస్తున్న పోలీస్ సిబ్బంది కష్టాలను ఏ ప్రభుత్వమూ పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఆయా వర్గాల నుంచి వినిపిస్తోంది. గత వైసిపి ప్రభుత్వం పోలీసులను ప్రైవేట్ సైనంలా వాడుకున్నప్పటికీ నిబంధనల ప్రకారం ఇవ్వాల్సినవి సక్రమంగా ఇవ్వలేదని ఆయా వర్గాలు అసంతృప్తిగా ఉన్నాయి. తాము అధికారంలోకి వస్తే పోలీసుల సమస్యలు పరిష్కరిస్తామంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇటీవల జరిన ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. కూటమి అధికారం చేపట్టి ఆరు నెలలు గడచినా ఇప్పటి వరకూ పోలీసులకు ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోయింది. కనీసం ఎప్పటికీ అమలు చేస్తారో కూడా తెలియడం లేదని పోలీసు ఉద్యోగులు వాపోతున్నారు. ఎప్పుడో చిలకలూరిపేటలో 35-40 సంవత్సరాల క్రితం ఉన్న 30-40 మంది పోలీసుల సిబ్బందే నేటికీ ఉన్నారు. ఆ నాటి జనాభా 50 వేలు ఉంటే.. ప్రస్తుతం ఆ సంఖ్య 1.40 లక్షలకు చేరింది. ప్రస్తుతం పట్టణంలో సుమారు 70 మంది.. రూరల్‌లో 35 మంది వరకు పని చేస్తున్నారు. వీరిలో ఇప్పటికే కొంతమంది ఉద్యోగ విరమణ చేశారు. వారి స్థానంలో కొత్తగా బదిలీపై ఇక్కడకు వచ్చిన వారే గానీ.. కొత్త నియామకాలపై స్పష్టత ఇవ్వడవం లేదు. దీంతో పని భారం విపరీతంగా పెరిగిందని ఉద్యోగులు చెబుతున్నారు. కానిస్టేబుల్ నుంచి ఏ.ఎస్.ఐ, ఇతర సిబ్బంది కలపుకుని అర్బన్, రూరల్ మొత్తం మండల స్థాయిలో దాదాపు 80 -110 వరకు.. నియోజకవర్గ స్థాయిలో యడ్లపాడు, నాదెండ్ల కలిపి మొత్తంగా140-150 మంది వరకు సిబ్బంది ఉన్నారు. ప్రస్తుతం సరెండర్ లీవ్ సమ్మె, టీఏ చెల్లింపులు వంటివి ఏవీ చేయడం లేదని పోలీసు వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. పండగ పూట కూడా తమ ఉద్యోగాలకు తీపి కబురు ఉండటం లేదని వారంతా వాపోతున్నారు.

ఉత్సాహంగా గణిత మేళా

ప్రజాశక్తి - వినుకొండ

జాతీయ గణిత దినోత్సవం పురస్కరించుకొని శావల్యాపురం శ్రీరామ పబ్లిక్ స్కూల్‌లో గణితమేళాను సోమవారం ఉత్సాహంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో నాటిన మొక్కలు చుట్టూ శాశ్వతంగా నిర్మించిన రేఖాగణిత ఆకృతులను ఎంఈఓ ముసునూరి లలిత కుమారి ఆవిష్కరించారు. గణిత మేళాలో పాఠశాల విద్యార్థులు చేసిన వివిధ గణితాంశాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎంఈఓ లలిత కుమారి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి శ్రీనివాస్ రామానుజన్ వలె ప్రతి అంశాన్ని లాజిక్‌గా ఆలోచించాలని చెప్పారు. నిత్యజీవితంలో మనం ఉపయోగించే అనే అంశాలు గణితంతో ముడిపడి ఉంటాయని గ్రహించాలన్నారు. పాఠశాల స్థాయిలో నిర్వహించిన గణిత ప్రతిభా పరీక్షలో, గణిత మేళాలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎంఈఓ చేతుల మీదుగా మెమొంటోలు బహూకరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కెవిఆర్ మోహన్ చంద్, ప్రిన్సిపాల్ రత్నకుమారి, డైరెక్టర్ కె అజిత్ చంద్, కే మేఘన తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-పెదకూరపాడు

పెదకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గణిత మేధావి రామానుజన్ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు కాకాని వెంకటరమణ, హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కంచర్ల బుల్లిబాబు మాట్లాడుతూ రామానుజన్ జీవిత విశేషాలను వివరించారు. గణిత ఉపాధ్యాయులు జె.నరేష్, రాయపూడి సాంబశివరావు, మేడా సాంబశివరావులను సన్మానించారు. అనంతరం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

భవిత కేంద్రంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి పట్టణంలోని భవితా కేంద్రంలో సెమీ క్రిస్మస్ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ పొరుగు వారిని ప్రేమిస్తూ, దయాగుణం కలిగి ఉండాలని సూచించారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్రం రిసోర్స్‌పర్సన్ ఏవీ శ్రీనివాస్, భవిత కేంద్రం ఫిజియోథెరపిస్ట్ ప్రశాంతి, ఉపాధ్యాయురాలు జ్యోతి పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పద్మ నియామకం

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా కొండవీటి పద్మ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల రసాయన శాస్త్ర అధ్యాపకురాలిగా పనిచేస్తున్న ఆమె.. ఉద్యోగోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ ఇన్చార్జి ప్రిన్సిపాల్‌గా పని చేసిన కోటేశ్వరమ్మ.. పొదిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు బదిలీ అయ్యారు.

తాళ్లూరు పాఠశాలకు వితరణ

ప్రజాశక్తి-పెదకూరపాడు

మండలంలోని తాళ్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సౌండ్ సిస్టమ్ నిమిత్తం ఎంఎల్‌టి ఫౌండేషన్ ఛైర్మన్ మల్లవరపు ఆరోగ్యయ్య చౌదరి రూ.10 వేలు వితరణగా అందించారు. ఈ మేరకు మొత్తాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డికి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్య బలోపేతానికి దాతలు, వివిధ వర్గాల చేయూత అవసరమని తెలిపారు. దాతలు విరివిగా స్పందించాలని కోరారు. ఉపాధ్యాయులు జయరాజు తదితరులు పాల్గొన్నారు.

సాటివారికి సహాయపడటమే క్రీస్తు సందేశం

ప్రజాశక్తి-తాడేపల్లి
ఎదుటివారికి సహాయం చేసే గుణం ప్రతి ఒక్కరికీ ఉండాలని.. క్రీస్తు బోధనలు ఇదే విషయాన్ని తెలియజేస్తాయని ఆంధ్రప్రదేశ్ ఎస్సీ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి, డాక్టర్ పెదపూడి విజయకుమార్, ఎస్సీ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ కృష్ణవేణి అన్నారు. సోమవారం ఏపీ ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో వారు పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఉండవల్లి శ్రీదేవి మాట్లాడుతూ.. నిజమైన ప్రేమతత్వం కలిగిన వ్యక్తి జీసస్ అని తెలిపారు.

కేకు కోస్తున్న ఉండవల్లి శ్రీదేవి, ఎస్పీ రవీంద్రనాయక్

నైతిక విలువలతో విద్యాబోధన అవసరం

మంగళగిరి: నైతిక విలువలతో విద్యను అభ్యసించి, మంచి మార్గంలో విద్యార్థులు పయనించాలని మంగళగిరి పట్టణ ఎస్ఐ రవీంద్ర నాయక్ సూచించారు. మంగళగిరి టిప్పర్ల బజార్లోని నేషనల్ ఒకేషనల్ జూనియర్ కాలేజీ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేకును కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం మాట్లాడుతూ క్రీస్తు బోధనలు మానవాళికి అనుసరణీయమన్నారు. పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బంగారు పతకాలను అందజేశారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ కాకుమాను సౌజన్య ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, గేయాలు ఆకట్టుకున్నాయి.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

తెనాలి రూరల్ : కొలకలూరు ఎస్‌ఫోర్ హెల్త్ కేర్ సొల్యూషన్స్‌లో సోమవారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంస్థ యజమాని ఎం.సరోజిని అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం పల్నాడు జిల్లా ప్రాజెక్టు మేనేజరు కె.అమల కుమారి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం సండే స్కూల్ నిర్వాహకురాలు ఎం.హౌలి నేతృత్వంలో సండే స్కూల్ బాలబాలికలతో క్రీస్తు పుట్టుక నాటికను ప్రదర్శించారు. సంస్థ మార్కెటింగ్ మేనేజర్ ఎం.సంపెంగరావు, పర్సనల్ మేనేజర్ ఎం.రవికుమార్, విశ్రాంత ఉపాధ్యాయిని ఎన్.విమలమ్మ, పుత్తూరు ఎపి ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రిన్సిపల్ ఎం.శేషగిరి, ఎపిటిడబ్ల్యూ రెసిడెన్షియల్ రసాయన శాస్త్రం అధ్యాపకురాలు నేల జయలక్ష్మి, ఎం.కరుణామయి, పి.భారతి, విజయకుమారి, ఎం.వెంకటేశ్వరరావు, కె.కిరణ్మయి పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 11 వినతులు

ప్రజాశక్తి-తెనాలి రూరల్
ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. అర్జీదారుల నుంచి తెనాలి సబ్ కలెక్టర్ వి.సంజన సింహ వినతులు స్వీకరించారు. వివిధ సమస్యలపై మొత్తం 11 విజ్ఞప్తులు అందాయి. వచ్చిన అర్జీలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సబ్ కలెక్టర్ ఆదేశించారు.

రేషన్ పంపిణీ చేపట్టేదెప్పుడు?

ప్రజాశక్తి- మేడికొండూరు
మండలంలోని పేరేచర్ల సచివాలయం-3 పరిధిలోని వైఎస్ఆర్ బొమ్మ సమీప ప్రాంతాలకు రేషన్ పంపిణీ వాహనం సక్రమంగా రాకపోవడంపై స్థానిక మహిళలు సోమవారం ఆందోళనకు దిగారు. పేరేచర్ల సీపీఎం నాయకులు బాషా ఆధ్వర్యంలో సచివాలయ కార్యదర్శిని కలిసి సమస్యను వివరించారు. వచ్చే నెలలో తప్పకుండా పంపిస్తామని వీఆర్వో హామీ ఇవ్వడంతో తమ ఆందోళన విరమించారు.

సైబర్ నేరాలపై అవగాహన తప్పనిసరి

ప్రజాశక్తి-మంగళగిరి
మంగళగిరి పట్టణంలోని బైపాస్ రోడ్‌లో సోమవారం ధనలక్ష్మి గోల్డ్ క్లస్టర్, గుంటూరు జిల్లా స్వర్ణకార సంఘం అధ్యక్షుడు పారేపల్లి మహేష్ ఆధ్వర్యంలో స్వర్ణకారులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఫౌండేషన్ ఆఫ్ ఎంఎస్ఎంఈ క్లస్టర్ మేనేజర్ రాజ్ కుమార్, గుంటూరు జిల్లా విశ్వకర్మ స్వర్ణకార సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాస్, స్వర్ణకార డైరెక్టర్ రామారావు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. సైబర్ నేరగాళ్ల పట్ల స్వర్ణకారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆన్లైన్ మోసాలు, సోషల్ మీడియా, ఫేక్ ఫోన్ కాల్స్, వాట్సాప్ లింకులు పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని దుర్వినియోగం చేస్తూ, వ్యక్తిగత సమాచారంతో సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని.. అటువంటి వాటి పట్ల జాగురకతగా వ్యవహరించాలని తెలిపారు. డయేషన్ ఫౌండేషన్ గూగుల్ సహకారంతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు స్వర్ణకారుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్ తెలిపారు.

ఆలస్యంగా రిజిస్ట్రేషన్లు.. తప్పని ఇబ్బందులు

ప్రజాశక్తి-మంగళగిరి
మంగళగిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మూడు రోజులుగా రిజిస్ట్రేషన్లలో జాప్యం వల్ల ఇబ్బందులు తప్పడం లేదు. సబ్ రిజిస్ట్రార్ పరిధిలో ఉన్న గ్రాంటు జిల్లా రిజిస్ట్రార్‌కు ఇవ్వడం వల్ల ఆలస్యం జరుగుతున్నట్లు సిబ్బంది చెబుతున్నారు. కొత్తగా ఈ విధానాన్ని ఈనెల 20వ తేదీ నుంచి అమలు చేస్తున్నారు. ప్రస్తుతం సబ్ డివిజన్ పరిధిలో ఉన్న ప్లాట్లు, భూములు, కోర్టు వివాదాల్లో ఉన్న భూములు తదితర సర్వే నంబర్ల రిజిస్ట్రేషన్లు ఆలస్యంగా జరుగుతున్నాయి. దీనివల్ల మూడు రోజుల్లో 41 డాక్యుమెంట్లు నిలిచిపోయినట్లుగా తెలుస్తోంది. దీంతో మంగళగిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి రిజిస్ట్రేషన్ కోసం వచ్చే క్రయవిక్రయదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం వస్తే.. సాయంత్రానికైనా అవుతుందా, లేదా? అని ఎదురుచూస్తూ ఉండిపోతున్నారు. సంబంధిత అధికారులు సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

కేఎల్‌యూలో ముగిసిన సదస్సు

ప్రజాశక్తి-తాడేపల్లి
రూరల్ కె.ఎల్.డీమ్డ్ యూనివర్సిటీలో భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు సోమవారం ముగిసింది. ఈ సదస్సుకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖ భౌతిక శాస్త్రవేత్తలు, పరిశోధకులు, పరిశ్రమ నిపుణులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. నానో మెటీరియల్స్‌లో తాజా పరిణామాలను, ఇంధన నిల్వ వ్యవస్థల భవిష్యత్తును రూపొందించడంలో వాటి కీలక పాత్రను ప్రదర్శించినట్లు భౌతిక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ కె.స్వప్న తెలిపారు. కన్వీనర్ డాక్టర్ ఎస్.షణ్ముగన్ మాట్లాడుతూ.. అత్యాధునిక పరిశోధనలు, అభివృద్ధి చెందుతున్న పోకడలు, ఇంధన నిల్వలో సాంకేతిక ఆవిష్కరణలపై చర్చలు, నెట్‌వర్కింగ్ తదితర విలువైన అంశాలను విద్యార్థులు తెలుసుకునేందుకు ఈ అంతర్జాతీయ సదస్సు వేదికగా ఉపయోగపడిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారధి వర్మ, ప్రో చాన్సలర్ డాక్టర్ కెవిఎస్.జగన్నాథరావు, ప్రో వైస్ చాన్సులర్లు డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్, ఎన్.వెంకటర్ రామ్, కెఎల్ కాలేజ్ ఆఫ్ సైన్సెస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం, ఎఫ్ఈడీ ప్రిన్సిపల్ డాక్టర్ కృష్ణారెడ్డి, ఆర్అండ్‌డి డీన్ బిటిపి మాధవ్, భౌతిక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ కె.స్వప్న, కన్వీనర్ డాక్టర్ ఎస్.షణ్ముగన్ తదితరులు పాల్గొన్నారు.

గణితానికి దిశానిర్దేశం భారతీయులే..

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్
ప్రపంచ గణితశాస్త్రానికి మన భారతీయులే అద్భుత కానుక ఇచ్చారని కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీ గణిత విభాగాధిపతి డాక్టర్ బీవీ అప్పారావు అన్నారు. విశ్వవిద్యాలయంలో సోమవారం గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా రామానుజన్ చిత్రపటానికి పులమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణిత శాస్త్రానికి దిశానిర్దేశం చేసిన శాస్త్రవేత్తలు మన దేశంలో చాలా మంది ఉన్నారని గుర్తు చేశారు. ఆర్యభట్ట, మహావీర, బ్రహ్మగుప్త, శ్రీనివాస రామానుజన్ వంటివారు గణితశాస్త్రంలో చేసిన పరిశోధనలు అపారమని తెలిపారు. కార్యక్రమంలో వీసీ డాక్టర్ జి.పార్థసారధివర్మ, డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్
క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని మక్కువారిపేటలో వేమూరు జార్జి జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు సోమవారం పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు, నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు వేమూరు మైనర్ బాబు మాట్లాడుతూ సమాజం మంచి మార్గంలో నడిచేందుకు క్రీస్తు బోధనలు దోహదపడతాయని చెప్పారు.

'సైబర్' పోటీల్లో నిర్మల ఫార్మసీ విద్యార్థులకు ప్రథమ బహుమతి

ప్రజాశక్తి-మంగళగిరి రూరల్
సైబర్ నేరాలపై అవగాహన వారోత్సవాల్లో భాగంగా గుంటూరు పోలీసు శాఖ నిర్వహించిన షార్ట్ వీడియో కాంటెస్ట్ పోటీల్లో నిర్మల ఫార్మసీ కళాశాల విద్యార్థులకు ప్రథమ బహుమతి లభించింది. మంగళగిరి మండలం ఆత్మకూరు గ్రామంలో గల కళాశాల విద్యార్థులు అమూల్య, లిల్లీ ప్రసన్న బృందంగా పాల్గొని ప్రథమ బహుమతిగా రూ.25 వేలు, ప్రశంసా పత్రాన్ని గుంటూరు ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ చేతుల మీదుగా సోమవారం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి గ్రామీణ సీఐ వై.శ్రీనివాసరావు, ఎస్సై చిరుమామిళ్ల వెంకట్, నిర్మల ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాములరెడ్డి, డాక్టర్ యూస్ పాల్గొన్నారు. బహుమతి పొందిన విద్యార్థులను కళాశాల ప్రతినిధులు డాక్టర్ యు.శౌరి, కరస్పాండెంట్ రెవరెండ్ సిస్టర్ జి.నిర్మల జ్యోతి అభినందించారు.

లఘుచిత్రాల్లో 'అభ్యుదయ'కు బహుమతి

ప్రజాశక్తి-గుంటూరు
సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి పోలీసు శాఖ 'సైబర్ వేలార్' పేరుతో వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించిన లఘుచిత్ర పోటీలలో స్థానిక లక్ష్మీపురం అభ్యుదయ మహిళా కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. డిగ్రీ ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు నిర్మించిన 'లాగిన్ టు డేంజర్' లఘుచిత్రానికి కన్సోలేషన్ బహుమతి వచ్చిందని కళాశాల డైరెక్టర్ బిఎస్ఆర్‌కె ప్రసాద్, బి.రోహిణీదేవి తెలిపారు. ఈ సందర్భంగా ఆయా విద్యార్థినులను సోమవారం కళాశాలలో అభినందించారు.

కాలువ పనులపై మహిళల అభ్యంతరం

ప్రజాశక్తి-దుగ్గిరాల
'మాకు ఎటువంటి ఇబ్బందీ లేదు. మేం ఎవరికీ ఫిర్యాదు చేయలేదు. మా ఇంటి ముందు ఎందుకు కాలువలు తీస్తున్నారు?' అని మండలంలోని ఈమని గ్రామం ఐదో వార్డులో మహిళలు సోమవారం సంబంధిత పనులను అడ్డుకున్నారు. జేసీబీకి అడ్డంగా కూర్చున్నారు. గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ఉత్తరం నుంచి దక్షిణం వైపు మురుగునీరు వెళ్లాలని కోర్టును ఆశ్రయించినట్లు తెలిసింది. దీంతో కలెక్టర్ అక్కడ పరిస్థితులను బట్టి మురుగునీరు పోయే ఏర్పాటు చేయాలని స్థానిక పంచాయతీ అధికారులకు సూచించినట్లు సమాచారం. దక్షిణం వైపు వచ్చిన మురుగునీరు దిగువకు వెళ్లే అవకాశం లేకపోవడంతో కాలువలు తీసేందుకు సిద్ధమయ్యారు. దీంతో పనిని స్థానిక మహిళలు అడ్డుకున్నారు.

అగ్నిప్రమాదంపై మరో విడత విచారణ

ప్రజాశక్తి-దుగ్గిరాల
స్థానిక శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో పంట నష్టపోయిన వారి వివరాలు సేకరించేందుకు హైదరాబాద్‌కు చెందిన విచారణ సంస్థ ఈ నెల 27, 28వ తేదీల్లో రెండో విడత విచారణ ప్రారంభించనుందని వ్యవసాయ మార్కెటింగ్ యార్డ్ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ ఎన్.శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 16, 17వ తేదీల్లో మొదటి విడత విచారణ చేపట్టిన విషయం విదితమే. ఆ సమయంలో అందుబాటులో లేనివారి కోసం మరో విడత విచారణ చేపట్టనున్నట్లు ఆయన చెప్పారు.

మంత్రి నారాయణతో రిజిస్ట్రార్ భేటీ

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయానికి వచ్చిన రాష్ట్ర పురపాలక , పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పి. నారాయణను విశ్వవిద్యాలయ ఇన్చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం మర్యాద పూర్వకంగా కలిశారు. మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్మెంట్ అంశంపై జరిగిన వర్క్ షాప్ లో పాల్గొనేందుకు ఆయన సోమవారం యూని వర్సిటీకి వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను రిజిస్ట్రార్ హోదాలో మర్యాదపూర్వకంగా కలిసి వర్సిటీకి ఆహ్వానించారు.

ఫార్మసీ అధ్యాపకులు డాక్టర్ రవిశంకర్‌రెడ్డికి సైంటిస్ట్ అవార్డు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఫార్మసీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ డి . రవి శంకర్ రెడ్డికి యంగ్ సైంటిస్ట్ (యువ శాస్త్రవేత్త) అవార్డు వచ్చింది. అలీఘర్ లోని మంగళయతన్ విశ్వవిద్యాలయంలో 18వ వార్షిక కన్వెన్షన్ ఆన్ బయోటెక్నాలజీ అండ్ ఫార్మసీ ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ బయో ఫార్మా స్యూటికల్స్ అండ్ ట్రాన్సేషన్ రీసెర్చ్ ఫర్ హ్యూమన్ హెల్త్ అనే అంశంపై అంతర్జాతీయ సదస్సు జరిగింది. ఈ సదస్సులో పాల్గొన్న రవిశంకర్ రెడ్డి డయాబెటిక్ యాక్టివిటీ పై పరిశోధన పత్రాన్ని సమర్పించి ప్రతిభ కనబరిచారు. దీనికి గాను యంగ్ సైంటిస్ట్ అవార్డును ప్రధానం చేసినట్లు అసోసియేషన్ ఆఫ్ బయోటెక్నాలజీ అండ్ ఫార్మసీ జనరల్ సెక్రటరీ ఆచార్య కేఆర్ఎస్. సాంబశివరావు తెలిపారు. సైంటిస్ట్ అవార్డు పొందిన రవి శంకర్ రెడ్డి ని ఇన్చార్జి వీసీ ఆచార్య కే. గంగాధర రావు, ఇన్చార్జి రెక్టర్ ఆచార్య కే. రత్న షీలా మణి, ఇన్చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ప్రమీల రాణి , అధ్యాపకులు అభినందనలు తెలియజేశారు.

వర్సిటీ మహిళా హాకీ జట్టు ఎంపిక

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ మహిళల హాకీ జట్టు ఎంపిక చేసినట్లు వ్యాయామ విద్య కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య పి. జాన్సన్ తెలిపారు. ఈ జట్టు ఈనెల 26 నుంచి తమిళనాడు లోని భారతీ దాస్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో అన్న స్టేడియం లో జరిగే సౌత్ జోన్ మహిళల హాకీ పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 16న హాకీ జట్టు ఎంపికలు జరిగాయి. ఈ ప్రక్రియలో ముప్పాళ్ళలోని ధనలక్ష్మి వ్యాయామ విద్య కళాశాల, గుంటూరు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన క్రీడాకారిణులు పాల్గొన్నారు. 18 మంది క్రీడాకారిణిలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ జట్టులో బి. నీరజ, కె .లక్ష్మీ సౌజన్య, పి. రాజేశ్వరి, ఎం. తులసి,,కే. చిన్ని, ఈ. మీనా, సిహెచ్. నీలిమ, ఆర్. ధనలక్ష్మి, బి. కాంచన, జె. దర్శిని, ఎం. నాగవినీల, ఎస్ కే. ఫాతిమా బీబీ, ఏ. గుహంబిక, వి. పుష్ప, బి. కావ్య, డి. దివ్య, కే. అనూష, ఆర్. అనిత లు ఉన్నారు. ఈ జట్టుకు మేనేజర్ గా ఆర్ వి శశికుమార్, కోచ్ గా జే. ఉదయకిరణ్, అసిస్టెంట్ కోచ్ గా రాఘవేంద్రరావు వ్యవహరిస్తారని జాన్సన్ తెలిపారు. జట్టుకు ఇన్చార్జి వీసీ ఆచార్య కే. గంగాధరరావు, ఇన్చార్జి రెక్టార్ ఆచార్య కె . రత్న షీలా మణి, ఇన్చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలంలు శుభాకాంక్షలు తెలిపారు.

అంజని కుమారికి ఉత్తమ గణిత అధ్యాపకురాలి అవార్డు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఆంధ్రప్రదేశ్ మ్యాథమెటిక్స్ ఫోరం ఆధ్వర్యంలో ఆదివారం రాజమండ్రిలో రాష్ట్ర స్థాయి గణిత దినోత్సవ వేడుకలు నిర్వహించారు. పేపర్ ప్రజెంటేషన్ పోటీలలో ఇన్నోవేటివ్ ఐడియాస్ ఇన్ టీచింగ్ మాథమాటిక్స్ అనే అంశానికి, టీఎంఎల్‌కు గాను నకరికల్లు మండలం, దేచవరం గ్రామంలో గల ఏపి మోడల్ స్కూల్ గణిత అధ్యాపకురాలు పంగులూరు అంజని కుమారి ఉత్తమ బహుమతులను గెలుపొందారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డిప్యూటీ డైరెక్టర్ ఎస్.అబ్రహం చేతుల మీదుగా అంజని కుమారి బహుమతులను అందుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో అంజని కుమారిని ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు కె. వెలంగిని మేరీ, తోటి ఉపాధ్యాయులు అభినందనలు తెలి పారు.

ఏపీలో సార్వత్రిక విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలి..

కలెక్టర్ గ్రీవెన్స్‌కు 155 అర్జీలు

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మీ, అధికారులు

ప్రజాశక్తి-గుంటూరు

సిఎంఒ పోర్టల్‌లోని పిటీషన్లతో పాటు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన పిటీషన్లు నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ , సంయుక్త కలెక్టర్ ఏ.భార్గవ్‌తేజ, డిఆర్ఓ ఖాజావలి, డిప్యూటీ కలెక్టర్లు లక్ష్మీకుమారి, గంగరాజు ప్రజల నుండి 155 ఫిర్యాదులను స్వీకరించారు. ఆయా అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు అందచేసి, సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. తమ సమస్యల పరిష్కారానికి పిటీషన్లు అందించేందుకు వచ్చిన దివ్యాంగుల పిటీషన్లను జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి దివ్యాంగుల వద్దకే వెళ్ళి స్వయంగా స్వీకరించారు. శాఖల వారీగా పెండింగ్ దరఖాస్తులను జిల్లా సంయుక్త కలెక్టర్ ఏ. భార్గవ్ తేజ సమీక్షించి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ శంకర్, పంచాయితీ రాజ్ ఎస్.ఇ బ్రహ్మయ్య, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక విశ్వవిద్యాలయం కోసం వినతి

ఆంధ్రప్రదేశ్‌లో సార్వత్రిక విశ్వ విద్యాలయం ఏర్పాటు చేయాలని కోరుతు అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ జెకెసి కాలేజి సెంటర్ సిబ్బంది గ్రీవెన్స్‌లో అర్జీ అందచేశారు. దేశంలోనే తొలిసారిగా ఉమ్మడి రాష్ట్రంలో గతంలో ఏర్పాటు చేసినవేసిన ఎపి సార్వత్రిక విశ్వవిద్యాలయం 1992లో అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంగా మార్చారన్నారు. అయితే రాష్ట్ర విభజన నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం 2024-25 విద్యా సంవత్సరం నుండి ఎపిలో అడ్మిషన్లు నిలిపివేస్తూ నిర్ణయం తీసుకుందన్నారు. గత మూడు సంవత్సరాలుగా రాష్ట్రంలోని అభ్యాసక కేంద్రాల్లో పనిచేస్తున్న పార్ట్‌టైమ్ సిబ్బందికి జీతాలు కూడా నిలిచిపోయాయన్నారు. యూని వర్సిటీ పరిధిలో అడ్మిషన్ తీసుకుని ఇంకా కోర్సు పూర్తి చేయని ఎపి విద్యార్థులు సుమారు 2 లక్షల మంది ఉన్నారన్నారు. దూర విద్యకు డిమాండ్ ఉన్న నేపథ్యంలో విభజిత ఏపిలో సార్వత్రిక విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని కోరారు. అర్జీ ఇచ్చిన వారిలో పి.అప్పారావు, పి.నరసింహారావు, ఎన్.వి.శేషయ్య, బి.వి.కుమార్ తదితరులు ఉన్నారు.

ప్రజలకు సౌకర్యంగా బ్రిడ్జిని నిర్మించాలి

చినకాకాని ఇండస్ట్రియల్ ఏరియాకు వెళ్లేందుకు గతంలో ఉన్న రాజ్‌కమల్ రోడ్డులోనే ఫ్లైఓవర్ నిర్మించాలని కోరుతూ ఇండస్ట్రియల్ ఏరియా ప్రజలు అర్జీ అందచేశారు. గతంలో సదరు మార్గంలో ఆర్అండ్‌బి రోడ్డు ఉండేదని, ప్రస్తుతం నూతన బైపాస్ వల్ల అది మూతపడిందన్నారు. అయితే అక్కడ ఏర్పాటు చేయాల్సిన ఫ్లైఓవర్‌ను అగ్రిగోల్డ్ వద్ద నిర్మించారన్నారు.దీని వల్ల చిన కాకాని నుండి పొలాలకు వెళ్లే రైతులు, నిడమర్రు పొలాలకు వెళ్లే రైతులు, అండస్ట్రియల్ ఏరియా కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున గతంలో ఉన్న ఆర్అండ్‌బి రోడ్డులోనే ఫ్లైఓవర్ నిర్మించాలని కోరారు. అర్జీ ఇచ్చిన వారిలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకర్, ఈ.రామారావు, చింతల భాస్కరరావు తదితరులున్నారు.

నంబూరులో పేదలకు పట్టాలివ్వాలి

నంబూరులో శ్రీలక్ష్మీ శివదుర్గా కాలనీలో గత పది సంవత్సరాలుగా ప్రభుత్వ భూముల్లో ఇళ్ల వేసుకొని నివాసం ఉంటున్న 60 యానాది కులంకు చెందిన కుటుంబాల నిరుపేదలకు పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ కాలనీవాసులు అర్జీ అందచేశారు. రైతుల పొలాల్లో ఎలుక బుట్టలు, వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నామన్నారు. కొంత మంది భూకబ్జాదారులు తమపై పోలీసు కేసు పెట్టించి మమ్ముల్ని బెదిరిస్తున్నారని వాపోయారు. కావున ఈ సమస్యపై సర్వే నిర్వహించి, మాకు న్యాయం చేయాలని కోరారు. ఈ స్థలాన్ని ప్రభుత్వ భూమిగా గుర్తించి, ఇళ్ల స్థలాలు లేని తమకు పట్టాలు, ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. అర్జీ ఇచ్చిన వారిలో బి.పార్వతి పి.వెంకటేశ్వరమ్మ, పి.లక్ష్మీపతి, టి.జ్యోతి తదితరులున్నారు.

వరదలకు దెబ్బతిన్న మోటార్లకు పరిహారం ఇవ్వాలి

ఈ ఏడాది అక్టోబర్, నవంబర్‌లో కృష్ణా నది వరదల కారణంగా పాడైపోయిన వ్యవసాయ మోటార్లను నమోదు చేసి, పరిహారం ఇప్పించాలని కోరుతూ రైతు సంఘం నాయకులు అర్జీ అందచేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ కొల్లిపర మండలంలో షుమారు వెయ్యికిపైగా మోటార్లు పాడైపోయాయని తెలిపారు. చిన్న రైతులు, కౌలు రైతులు ఒక్కొక్కరూ 2వేల నుండి రూ.10వేలు ఖర్చు చేసి మోటార్లు ఏర్పాటు చేసుకున్నారన్నారు. ఇంత వరకూ కనీసం ఎన్యుమరేషన్ కూడా చేయలేదన్నారు. అదే విధంగా పసుపు, కంద, అరటి, తమలపాకు, కూరగాయ పంటలు ధ్వంసం అయ్యాయని, వారందరికీ పరిహారం ఇవ్వాలని కోరారు. అర్జీ ఇచ్చిన వారిలో సంఘం నాయకులు ఈ.రామారావు, చింతల భాస్కరరావు, ఇ.నాగేశ్వరరావు తదితరులున్నారు.

ఘనంగా వివిఐటి వార్షికోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు

వివిఐటి కాలేజి 17వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆకట్టుకుంది. కళాశాలలో గడిపిన ఆనంద క్షణాలను పూర్వవిద్యార్థులు తోటి మిత్రులు, అధ్యాపకులతో పంచుకున్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన పూర్వ విద్యార్థుల సంఘం ద్వారా ప్రస్తుత విద్యుత్ భవిష్యత్ ప్రణాళికలకు సహాయ సహకారం అందిస్తామని తెలిపారు. అనంతరం వివిఐటి ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, వైస్ ఛైర్మన్ వాసిరెడ్డి మహదేవ్, ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లిఖార్జునరెడ్డి 2023-24 విద్యా సంవత్సరంలో అత్యుత్తమ ప్రదర్శన చూపిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందచేశారు. ఈ సందర్భంగా వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ వివిఐటి సంపూర్ణ క్రమశిక్షణ- సంపూర్ణ విద్య నినాదంతో క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తుందని తెలిపారు. కళాశాల విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించి విజేతలుగా నిలవటం సంతోషంగా ఉందన్నారు. ఈ వేడుకల్లో సాంప్రదాయ వస్త్రధారణతో విద్యార్థులు ప్రదర్శించిన సాంప్రదాయ నడక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో డీన్ డాక్టర్ కె.గిరిబాబు, డీన్ డాక్టర్ ఎన్.కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.